RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 93 | శుక్రవారం, మే 10, 2024 | పేజీలు : 4

### తమిళనాడు బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుడు: 8 మంది మృతి

చెన్నై: శివకాశీ బాణాసంచా ఫ్యాక్టరీలో నేడు భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది చనిపోయారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. శివకాశీలోని చెంగమాల పట్టిలో శరవణన్ కు చెందిన 'శ్రీ సుదర్శన్ క్రాకర్స్' ఫ్యాక్టరీలో ఈ ప్రమాదం జరిగింది. బాణాసంచలో మందు నింపుతుండగా ఈ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఐదు మంది మహిళలతో సహా ఎనిమిది మంది మరణించారు. మరో 12 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని సమీప ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. పేలుడు కారణం ఏమిటనే విషయమై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## రోడ్ షో, బైక్ ర్యాలీలో పాల్గొన్న మంత్రి సీతక్క



జైనూర్: లోక్ సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ రోడ్డు షో, బైక్ ర్యాలీలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఈ లోక్ సభ ఎన్నికల్లో ఉద్యమ నాయకురాలు, ఆదివాసి బిడ్డ ఆత్రం సుగుణను గెలిపించాలని ప్రజల తరఫున పార్లమెంట్లో సమస్యలపై గళ్ళమెత్తుతుందన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే బడుగుల అభివృద్ధి

**తాడూరు:** మరికొద్ది రో జుల్లో జరగబోతున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచిన ట్లయితే బడుగు బలహీన వర్గాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుంద ని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్ల మెంట్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచా రంలో పాల్గొన్నారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులే దేశవ్యాప్తంగా చెప్పుకోదగినవిగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పేదలు, బడుగు బలహీన వ ర్గాల వారందరూ ఉ పయోగించుకుంటున్న ఉపాధి హామీ పథకాన్ని తెచ్చింది కేంద్రంలో ఉన్న అప్పటి కాం గ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ఓటర్లందరూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి కాం గ్రెస్‌కు మద్దతివ్వాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉండే కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ నాలు గు రోజులపాటు శక్తివంచన లేకుండా కృషి చేసి పార్టీ గెలుపునకు శ్రమించాల్సిందిగా సూచించారు. తాడూ రు జడ్పీటీసీ మండడి రోహిణి, ఎంపీటీసీ రేణుక, పార్టీ శ్రేణులు, గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య ఉన్నారు.

# కుల గణన చేస్తాం...

## ప్రతి మహిళకు లక్ష ఇస్తాం: రాహుల్ గాంధీ



నర్సాపూర్: తాము దేశంలోని పేదలందరి జాబితాను తయారు చేస్తామని ప్రతి పేద కుటుంబం నుంచి ఓ మహిళను ఎంచుకొని ఆ మహిళకు ఏడాదికి రూ. 1 లక్ష జమ చేస్తామన్నారు కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. అంటే నెలకు రూ. 8500 వస్తాయన్నారు. దీంతో పేదల జీవితాలు మారిపోతాయని పేర్కొన్నారు. ఈ పథకంతో భారతదేశ ఆర్థిక వ్యవస్థ జంప్ అవుతుందని జోస్యం చెప్పారు. ప్రధాని మోదీ ఈ పదేళ్లలో ఎంత అయితే కోటీశ్వరులకు ఇచ్చారో తాము అంతేమొత్తాన్ని పేదలకు పంచుతామని తెలిపారు. నర్సాపూర్‌లో నేడు జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశంలో కులగణన చేస్తుందని హామీ ఇచ్చారు. వివిధ వర్గాలు ఎంతనో తేలితే అప్పుడు అసలైన రాజకీయం మొదలవుతుందని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం వల్లే పేదలకు హక్కులు దక్కాయన్నారు. స్వాతంత్ర్యం, రాజ్యాంగం కోసం ఎంతో మంది ప్రాణత్యాగం చేశారని పేర్కొన్నారు. బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని రద్దు చేస్తామని, బయటపారేస్తామని అంటున్నారని మండిపడ్డారు. రాజ్యాంగానికి ముందు దేశంలో పేదలకు ఎలాంటి హక్కులు లేకుండా ఉండేదన్నారు. దేశంలో వెనుకబడిన వర్గాలు, దళితుల హక్కులను రాజ్యాంగం రక్షిస్తోందని పేర్కొన్నారు. రెండు సిద్ధాంతాల మధ్య ప్రస్తుత ఎన్నికలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని రక్షిస్తుందని మరెవరినీ రాజ్యాంగాన్ని రద్దు చేయనీయదని హామీ ఇచ్చారు. మీకు దక్కిన హక్కు రాజ్యాంగం వల్ల వచ్చిందనని సభకు వచ్చినవారిని ఉద్దేశించి అన్నారు. విద్య, ఉద్యోగాలు, ఓటు హక్కు అన్నీ రాజ్యాంగం ద్వారా వచ్చినవే అన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని మోదీ ప్రైవేటుపరం చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో పెట్టుబడిదారి వ్యవస్థను పెంచి పోషిస్తున్నారన్నారు. రిజర్వేషన్లను తొలగించేందుకు మోదీ ప్రైవేటైజేషన్ చేస్తున్నారని ఆరోపించారు. దేశంలో కేవలం 2 శాతం ఉన్న వాళ్ల చేతిలో సంపద ఉందన్నారు. ప్రధాని మోదీ దేశంలోని విమానాశ్రయాలను, పోర్టులను అదానీపరం చేస్తున్నారని ఆరోపించారు.

# పార్లమెంటు ఎన్నికల తర్వాత ఈ ప్రభుత్వం... ఉంటదో... ఊడుతదో...

**కరీంనగర్:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో చెప్పినవన్నీ భూటకపు హామీలు అని.. అరచేతిలో వైకుంఠం చూపించారని తెలంగాణ రైతాంగం బాధపడుతుందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేపట్టిన బస్సు యాత్రలో భాగంగా కరీంనగర్ పట్టణంలో పర్యటించిన కేసీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలతో మోసం చేసిందని మండిపడ్డారు. రైతుబంధు కింద రూ. 15వేలు ఇస్తామని చెప్పారని.. ఇవ్వకుండా దోఖా చేశారని.. మేం రెండు వేల పింఛన్ ఇస్తే 4 వేలు ఇస్తామని చెప్పి దోఖా చేసింర్రు అని మండిపడ్డారు. మేం ఇచ్చిన వాటికి డబుల్, త్రిబుల్ ఇస్తామని చెప్పి ప్రజలను మోసగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు 5 లక్షల గ్యారంటీ కార్డు ఇస్తామన్నారు.. ఎవరికైనా ఇచ్చింర్రా అని ప్రశ్నించారు. ఇచ్చిన హామీల్లో మహిళలకు ఫ్రీ బస్సు మాత్రం నెరవేర్చారని కేసీఆర్ అన్నారు. మహిళలకు ఫ్రీ బస్సు పెడితే.. ఆ బస్సుల్లో సర్కస్‌లో జరిగినట్లు కొట్లాటలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మహిళలు జుట్లు పట్టుకుని కొట్లాడుకునే పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఉచిత బస్సు పథకం మాకెందుకు అని మహిళలే నిలదీస్తున్నారని తెలిపారు. ఈ స్కీమ్‌తో ఆటో డ్రైవర్లు రోడ్డున పడ్డారని అన్నారు. గోదావరి నిండా బ్యారేజీలు కట్టి అమృతధారల్లాంటి నాలుగు జలధారలను ఈ కరీంనగర్ చుట్టూ నిర్మించామని కేసీఆర్ తెలిపారు. కానీ అవన్నీ ఇవాళ మాయమైనయని అన్నారు. మళ్లీ ఊళ్లళ్లకు బోరుబండ్లు వస్తున్నాయని.. పూడికలు తీసే క్రేన్లు వస్తున్నాయని.. రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు వచ్చినయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంతకాలం ఉన్న కరెంటు ఎక్కడికిపోయిందని ప్రశ్నించారు. రెప్పపాటు కూడా పోకుండా తొమ్మిదేండ్లు కరెంటు ఇచ్చామని.. ఇప్పుడు ఎటు పోయిందని నిలదీశారు. మిషన్ భగీరథ నీళ్లు ఎక్కడికి పోయినయని ప్రశ్నించారు. మళ్లీ బిందెలు పట్టుకుని పోవడం, ట్యాంకర్లు రావడం, చూస్తుంటే నాకే కండ్లళ్లకు నీళ్లు వస్తున్నాయి.. ఇవన్నీ చూస్తుంటే చాలా బాధ కలగుతుందని భావోద్వేగానికి గురయ్యారు. కరెంటు ఎక్కడికిపోయింది.. మంచినీళ్లు ఎక్కడికి పోయినయ్.. ఇదేం దుస్థితి. ఏం దౌర్భాగ్యం.. ఈ పరిస్థితి ఎందుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగైదు నెలల్లోనే ఇంత ఆగమాగం ఎందుకు అవుతున్నామనేది ఆలోచించాలని ప్రజలకు సూచించారు. రైతుబంధు కింద 15వేలు ఇస్తామని నమ్మబలికి.. ఉన్న 10 వేలు ఇవ్వకుండా దాన్ని కూడా కింద మీద చేసి పరిస్థితి చేస్తున్నారని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత ఎమ్మెల్యేలు ఇచ్చిన కల్యాణ లక్ష్మీ వస్తుంది తప్ప.. కొత్త చెక్కులు ఇవ్వడం లేదన్నారు. 'మునుపు గరీబోళ్లకు రోగమో, నొప్పి వస్తే ఎమ్మెల్యే దగ్గరికి పోతే సీఎంఆర్ఎఫ్ చెక్కులు వచ్చేవి. ఇవాళ ఒక్క సీఎంఆర్ఎఫ్ చెక్కు కూడా ఇస్తలేరు. రేషన్ కార్డుల మీద సన్నబియ్యం ఇస్తామని చెప్పింర్రు.. సన్న బియ్యం ఇవ్వట్లేదు. ఏ ఒక్క వాగ్ధానం కూడా కాలేదు. అయ్యే పరిస్థితి కూడా లేదు.' అని అన్నారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత ఈ ప్రభుత్వం ఉంటదో.. ఊడుతదో.. ఏం జరుగుతదో తెలియదని అన్నారు.



## మీకు 15 నిమిషాలు సరిపోతే...

# మాకు 15 సెకండ్లు చాలు..



హైదరాబాద్: మజ్లీస్ పార్టీ నాయకుడు అక్బరుద్దీన్ ఓవైసీ 2013లో చేసిన వ్యాఖ్యానానికి బిజెపి నాయకురాలు నవ్ నీత్ రాణ్ కౌంటర్ ఇచ్చారు. అప్పట్లో అక్బరుద్దీన్ పోలీసులను 15 నిమిషాల పాటు తప్పించితే 100 కోట్ల మంది హిందువులకు తమ తడాకా ఏమిటో రుచి చూపిస్తామని అన్న విషయాన్ని గుర్తుచేస్తూ, ఆయనకు 15 నిమిషాలు సరిపోతాయేమో కానీ మాకు 15 సెకండ్లు చాలు... ముస్లింల అంతు చూడడానికి అన్నారు. నవ్ నీత్ రాణా ప్రస్తుతం లోక్ సభకు బిజెపి టికెట్ పైన పోటీ చేస్తున్నారు. బిజెపి అభ్యర్థి మాధవీ లత తరఫున ఆమె హైదరాబాద్ లో ప్రచారం చేస్తున్న సందర్భంగా ఈ హెచ్చరిక చేశారు. మాధవీ లత ప్రస్తుత ఎన్నికల్లో అసదుద్దీన్ ఓవైసీ మీద పోటీచేస్తోంది. నవ్ నీత్ రాణా తన ప్రచారంలో మాధవీలతను 'సివంగి'అని శ్లాఘించారు. ఆమె హైదరాబాద్ ను పాకిస్థాన్ గా మార్చకుండా ఆపగలుగుతుందని, రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలకు తోడ్పడుతుందని అన్నారు.

## గంట సమయం తీసుకోండి, భయపడం: ఓవైసీ

బిజెపి నాయకురాలు నవనీత్ కౌర్ రాణా తన ప్రచారంలో భాగంగా 'దేశంలో హిందూ-ముస్లిం నిష్పత్తిని బ్యాలెన్స్ చేయడానికి 15 సెకండ్ల సమయం ఇచ్చి చూడండి' అని అక్బరుద్దీన్ ఓవైసీకి ప్రతి సవాల్ విసరడంపై మజ్లీస్ నాయకుడు అసదుద్దీన్ ఓవైసీ ప్రతిస్పందించారు. ఆమెనెవరూ ఆపడంలేదని, ఎవరూ భయపడ్డం లేదని అసదుద్దీన్ అన్నారు. " వారేమి చేస్తారు? ప్రధాని మోడీ కూడా అధికారంలో ఉన్నారు. 15 సెకెండ్లు ఏమిటి%ొ%గంట సమయం తీసుకోనివ్వండి. వారెందుకు అనుకున్నది ఆచరణలో పెట్టడం లేదు?" అన్నారు. "ఎవరు మిమ్మల్ని ఆపుతున్నారు?ఎవరు మీకు భయపడుతున్నారు? మేము సిద్ధమే. ఎక్కడిక రమ్మంటారో చెప్పండి. అక్కడికి వస్తాం. మీకు ప్రధాని, ఆర్ఎస్ఎస్, ప్రతిదీ అనుకూలంగానే ఉంది" అని అసదుద్దీన్ అన్నారు. మజ్లీస్ కు ఓటేస్తే పాకిస్థాన్ కు ప్రయోజనం అని ప్రధాని మోడీ అనడంపై కూడా అసదుద్దీన్ ప్రతిస్పందించారు. మోడీ ఆహ్వానం లేకుండా ఆఫ్ఘనిస్థాన్ నుంచి పాకిస్థాన్ కు వెళ్లి అప్పటి ప్రధాని నవాజ్ షరీఫ్ ను కలిశారని కూడా ఈ సందర్భంగా తెలిపారు.

## కేజ్రీవాల్‌కు మధ్యంతర...

# బెయిల్ ఇవ్వొద్దు

### - సుప్రీంలో ఇడి అఫిడవిట్



న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వరాదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) గురువారం స్పష్టం చేసింది. ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం ప్రాథమిక హక్కు కాదని ఇడి తెలిపింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మధ్యంతర బెయిల్ కోసం అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా గురువారం ఇడి తరఫున ఆ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ భాను ప్రియ అఫిడవిట్ దాఖలు చేశారు. ఎన్నికల్లో ప్రచారం చేసే హక్కు ప్రాథమిక, రాజ్యాంగపరమైన, చట్టపరమైన హక్కేమీ కాదని ఇడి తన అఫిడవిట్‌లో పేర్కొంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి కానప్పటికీ తమకు తెలిసి దేశంలో ఏ రాజకీయ నాయకుడికి ప్రచారం కోసం మధ్యంతర బెయిల్ ఇవ్వలేదని ఇడి తెలిపింది. ఆప్ అధినేత మధ్యంతర బెయిల్ కోరడంపై ఇడి మండిపడుతూ గతంలో కూడా సమన్లను తప్పించుకోవడానికి కేజ్రీవాల్ ఐదు రాష్ట్రాలలో ఎన్నికలు ఉన్నాయంటూ ఇదే సాకు చూపారని తెలిపింది. ఎన్నికల ప్రచారం కోసం మధ్యంతర బెయిల్ మజూరు చేస్తే ఏ రాజకీయ నాయకుడిని అరెస్టు చేసి జుడిషియల్ కస్టడీకి పంపడం సాధ్యం కాదని ఇడి వాదించింది. గడచిన మూడేళ్లలో దాదాపు 23 ఎన్నికలు జరిగాయని, ఏడాది పొడవునా ఎన్నికలు జరుగుతూనే ఉంటాయని, ఎన్నికల ప్రచారం కోసం మధ్యంతర బెయిల్ ఇస్తే ఇక ఏ రాజకీయ నాయకుడిని అరెస్టు చేసి జుడిషియల్ కస్టడీకి తరలించలేమని ఇడి తన అఫిడవిట్‌లో పేర్కొంది. సార్వత్రిక ఎన్నికల ప్రచారం కోసం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం వల్ల చట్టానికి, సమానత్వానికి విరుద్ధమవుతుందని ఇడి వాదించింది. చిత్తశుద్ధి లేని నాయకులంతా నేరాలు చేయడానికి అనుమతించి ఎన్నికల ముసుగులో దర్యాప్తును తప్పించుకోవడానికి అవకాశం ఇచ్చినట్లవుతుందని ఇడి పేర్కొంది. సామాన్య పౌరుడికి మించి తమకు ప్రత్యేక హోదా ఉందని అరవింద్ కేజ్రీవాల్ కాని మరే రాజకీయ నాయకుడు కాని చెప్పుకునే అవకాశం లేదని ఇడి వాదించింది. దీని వల్ల దేశంలో రెండు రకాల తరగతులు ఏర్పడతాయ. ఒకరు సామాన్య పౌరులైతే మరొకరు రాజకీయ నాయకులని, సామాన్య పౌరులు చట్టానికి లోబడి ఉంటే ఎన్నికల ప్రచారం కోసం మధ్యంతర బెయిల్ పొందవచ్చన్న నమ్మకంతో చట్టాల నుంచి మినహాయింపును కోరే రాజకీయ నాయకులు మరొకరని ఇడి పేర్కొంది.

## సంపాదకీయం

# ప్రమాదంలో ప్రజాభిప్రాయం!

సాంకేతికత–ఆధునికత కలిసి క్రోనీ క్యాపిటలిజంతో జత కట్టినప్పుడు అవి స్వాభావికంగా విభేదించే అంశాలకు కూడా వాటి మనుగడ కోసం వేదికలుగా మారుతాయి. ప్రస్తుతం మన దేశంలో నెలకొన్న పరిస్థితులే అందుకు ఒక ఉదాహరణ. సోషల్ మీడియా వేదికగా హిందుత్వ మతోన్మాద శక్తులు.. ఉద్దేశపూర్వక తప్పుడు సమాచారం, తప్పుదోవ పట్టించే వార్తలు, నిర్దిష్ట సమూహాల చుట్టూ అల్లే కుట్ర సిద్ధాంతాలు, సూడో చరిత్రలను వ్యాప్తి చేస్తూ రాజకీయ లక్ష్యాలను సాధించాలని ప్రయత్నిస్తున్నాయి. బడా కార్పొరేట్ కంపెనీల చేతుల్లో ఉన్న ఆ సంస్థలు చేష్టలుడిగి ఒక బలమైన రాజకీయ పార్టీకి అనుకూల వైఖరిని అవలంబిస్తుండటం ఆందోళనకరం. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్, వాట్సాప్, యూట్యూబ్ తదితర సంస్థల యూజర్లలో అత్యధికులు భారతీయులే. భారతీయ యూజర్ల కారణంగా ఆ కంపెనీలు లక్షల కోట్లు గడిస్తున్నాయి. అందుకే మన దేశంలో నిష్పక్షపాతం కోసం ఆ కంపెనీలు తమ వ్యాపారాలను పణంగా పెట్టే సాహసం చేయడం లేదు. కొన్ని కంపెనీలు ఆ దిశగా అడుగులు వేస్తున్నా వాటికి తీవ్రమైన ఒత్తిళ్లు ఎదురవుతున్నాయి. సోషల్ మీడియా సంస్థల మార్కెట్ విదిత నిస్సహాయతను మతోన్మాద జాతీయవాద శక్తులు తమ అనుకూల ప్రజాభిప్రాయ నిర్మాణానికి, ప్రత్యర్థుల వ్యతిరేక కథనాల వ్యాప్తికి విచ్చలవిడిగా వాడుకుంటున్నాయి. ఏ ఎన్నికల్లో అయినా ప్రజలే నిర్ణేతలు అనేది సాంప్రదాయ పార్లమెంటరీ సూత్రీకరణ. కానీ, ఆ మెజారిటీ ఓటర్ల ప్రవర్తనను ప్రభావితం చేసే సైకలాజికల్ యంత్రాంగంగా సోషల్ మీడియా మారిపోయింది. అందుకే రాజకీయ పార్టీలు దానిమీద అంతగా ఆధారపడుతున్నాయి. ఆయా వేదికలను వాడుకోవడంలో ఆరితేరిన పార్టీలకు, వాటికి దన్నుగా పనిచేసే మతతత్వ సంస్థలకు, వారి అనుయాయులకు.. ఈ ఎన్నికల్లో ఓటేయనున్న వారిలో అత్యధికులు 18–40 ఏండ్లలోపు ఉన్న మిలీనియల్స్– జెన్–జీలే అధికమని, వారి దైనందిన వ్యక్తిగత జీవితం సోషల్ మీడియాతోనే ముడిపడి ఉన్నదని బాగా తెలుసు. అందుకే ఎప్పుడో మొదలుపెట్టిన మాయల ప్రచారాన్ని ఇప్పటికీ దూకుడుగా కొనసాగిస్తున్నారు. వీ–డెమ్ లాంటి ప్రతిష్ఠాత్మక పరిశోధన సంస్థలు 2023 నాటికే మన దేశాన్ని ఎన్నికల ద్వారా ఏర్పాటైన నియంతృత్వంగా గుర్తించాయి. 'సామాజిక భ్రమల్లోకి నెట్టివేసిన సమాజంలో ప్రజలు వాళ్లకు రుచించని ఆధారాలను తిరస్కరిస్తారు. ఆకర్షణీయంగా ఉన్న తప్పులనే నమ్మి కీర్తిస్తారు. అలాంటి భ్రమలను సృష్టించేవారు వారికి యజమానులుగా మారుతారు. కానీ, ఆ భ్రమల్ని తొలగించే వాళ్లు శత్రువులుగా మిగిలిపోతారు' అని ఫ్రెంచి సోషల్ సైకాలజిస్ట్ గుస్తవే లేబాన్ చేసిన హెచ్చరికను ఈ పరిస్థితి గుర్తుచేస్తున్నది. దేశ ఆర్థిక పరిస్థితి, విద్య, నిరుద్యోగం, ఆకలి, శాంతిభద్రతలు, ఆరోగ్యం, చరిత్ర, సైన్సు.. ఇలా ఏ రంగాన్ని తీసుకున్నా దేశంలో వాస్తవిక పరిస్థితి ఒకలాగా ఉంటే సోషల్ మీడియా వేదికగా కుప్పలుతెప్పలుగా పుట్టుకొచ్చిన సూడో చరిత్రకారులు మాత్రం అందుకు భిన్నంగా అభూత కల్పనలను సృష్టిస్తున్నారు. ప్రామాణిక గణాంకాలకు, చారిత్రక పరిశోధనలకు సైతం అంతుచిక్కని విధంగా కథనాలు వండి వారుస్తూ సాధారణ ప్రజలను భ్రమల్లోకి నెట్టేస్తున్నారు. వాళ్లు సృష్టిస్తున్న వదంతులు, దుష్ప్రచారాలన్నీ చాలామంది జేబుల్లోంచి (ఫోన్) మెదళ్లలోకి ప్రవేశించినవే. ఇలాంటి సూక్ష్మ, స్థూల అంశాలను పరిశీలించిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం ప్రపంచాన్ని కలవరపెడుతున్న తప్పుడు సమాచారం విపత్తును తక్షణం ఎదుర్కొనే దేశాల్లో భారత్ ప్రథమ స్థానంలో ఉందని హెచ్చరించింది.

స్క్రీన్ వెనకాల మారుపేర్లతో, మారుఫొటోలతో లేదా ఒక వ్యక్తిగా, ఒక మీడియా సంస్థగా, ఫేస్‌బుక్ పేజీలుగా, వాట్సాప్ గ్రూపులుగా నడిచే ఈ ఆన్‌లైన్ గుంపులు, ప్రభావకులు కేవలం వారు పనిచేస్తున్న పార్టీ రాజకీయ ప్రత్యర్థుల మీద, పార్టీల మీద వ్యతిరేక ప్రచారాలతో ఆగిపోలేదు. బలహీనమైన, సాంస్కృతికంగా భిన్నమైన మైనారిటీలను, దళితులు, ఆదివాసీలను ఎంచుకుని వారి సంస్కృతిని, అస్తిత్వాన్ని, మనుగడనూ ప్రశ్నిస్తున్నారు. వ్యతిరేక రాజకీయ అభిప్రాయాలున్న వ్యక్తుల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. చరిత్ర వాఖ్యానానికి సంబంధించిన ఏ విద్యార్హత లేని ఒక ప్రభావకుడు 'అసలు కులానికి, హిందూమతానికి సంబంధమే లేదు, అది బ్రిటిష్‌వాళ్ల సృష్టి' అని అంటాడు. ఇంకొకాయన 'అసలు అంబేద్కర్‌కు చదువే రాదు, రాజ్యాంగ రచనలో ఆయన పాత్ర ఏమీ లేదు' అని అంటాడు. దళితులకు, ఇతర వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ల వల్లనే దేశం వెనుకబడిందని ఇంకొక ఐటీ సెల్ భటుడు తీర్పు ఇస్తాడు. మైనారిటీలను నేరగాళ్లుగా, వారు ఉండే ప్రాంతాల్లో వేరే వాళ్లకు రక్షణే లేదని, అక్కడ ప్రభుత్వ యంత్రాంగం అసలు పని చేయదని ఇంకొందరు కథలు వ్యాప్తి చేస్తారు. ఇంకాస్త తలపండిన ప్రభావకులైతే మేధోమథనాల పేరు మీద చర్చలు పెట్టి, దళితులు, మైనారిటీల మీద, రాజ్యాంగం మీద బురద జల్లే ప్రయత్నం చేస్తారు. చరిత్ర అంతా తప్పు అని తీర్మానించేస్తారు. గత వైభవాన్ని మళ్లీ తీసుకొస్తానని యువకులు, మధ్య తరగతి వారిని రెచ్చగొట్టి 90 ఏండ్ల కిందట జర్మనీలో అడాల్ఫ్ హిట్లర్ అధికారంలోకి వచ్చారు. ఆ తర్వాత జోసెఫ్ గోబెల్స్‌ను సాంస్కృతిక–ప్రాపగండా శాఖమంత్రిగా నియమించారు. చరిత్ర, సైన్స్, అర్థ శాస్త్రం, రేడియో, సినిమా, సాహిత్యం, పత్రికలు, పిల్లల ఆటలు–పాటలు, బొమ్మలు.. ఇలా ఏ రంగాన్ని కూడా వదలకుండా అన్నింటిని ఆయన యూదు వ్యతిరేక అంశాలతో నింపేశారు. ఫలితంగా ఇటువంటి సోషల్ మీడియా లేని ఆ కాలంలో జరిగిన యూదుల ఊచకోత ఒక నెత్తుటి చరిత్రకు సాక్ష్యంగా మిగిలిపోయింది. ఈ ఎన్నికలకు నెలరోజుల ముందు యూట్యూబ్ వంటి వేదికల మీద ప్రభావకులుగా చెలామణిలో ఉన్న సుమారు 24 మందికి కంటెంట్ క్రియేటర్స్ పేరిట ప్రధాని మోదీ అవార్డులను అందజేసింది. ఆ పురస్కారాలను అందుకున్నవారిలో సగానికి పైగా బీజేపీ ఎదుగుదలకు తోడ్పడ్డవాళు లేదా ఆ పార్టీ భావజాలాన్ని వ్యాప్తి చేసినవాళ్లే. వారికి ఇచ్చిన గుర్తింపు, ప్రోత్సాహం అట్లాంటి విషయాల హేతుబద్ధతను, శాస్త్రీయతను పక్కకుపెట్టి నమ్మిన విషయం ప్రమాదకరమని తెలిసినా, ఎలాగైనా ప్రచారం చేసే వాళ్లకొక ఉత్ప్రేరకం లాంటిది. నేడు సోషల్ మీడియా ప్రభావకులుగా చెలామణి అవుతున్న వేలాదిమంది ఆన్‌లైన్ పోకిరిల చేతుల్లో బహుశా కొన్ని కోట్ల మంది ఓటర్ల మెదళ్లు ఉన్నాయి. వాళ్లు ఎన్నికల్లో ఓటర్ల నిర్ణయాన్ని మాత్రమే కాదు, తదనంతరం జరిగే పరిణామాల్లో వారి పాత్రను ప్రభావితం చేయబోతున్నారనేది ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, అదే నిజం.

# ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించేలా అధికారులంత సమన్వయంతో పనిచేయాలి






**జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :** పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ఎన్నికల నియమ నిబంధనలను అనుసరించి జిల్లాలో నోడల్ అధికార్లకు,పోలీస్ అధికారులు వారి వారికి కేటాయించిన విధులను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల విధులు ప్రశాంతంగా నిర్వహించాలని జనరల్ అబ్జర్వర్ డాక్టర్ ఎం.ఎస్.ప్రియాంక శుక్లా అన్నారు. గురువారం రోజున కలెక్టరేట్ లోని వి సి హాల్ లో జరిగిన సమావేశంలో పోలీస్ అబ్జర్వర్ డాక్టర్ రామేశ్వర్ సింగ్, వయ్యపరిశీలకులు మనోజ్ అలోయిస్ లక్రా, ధృవ్ భోళా జిల్లా ఎన్నికల అధికారి, గౌతమ్ , పోలీస్ అధికారులు, ఏ ఆర్ ఓ లు, నోడల్ అధికారులు ఈ సమావేశం పాల్గొన్నారు. మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గం లో 72 గంటల కంటే ముందు పోలింగ్ కు సంబంధించిన ఏర్పాట్లు, ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఎస్ ఎస్ టి , ఎఫ్ ఎస్ టి , వి ఎస్ టి , అకౌంటింగ్ టీం, ఎం ఎం సి , ఎక్స్పెంజ్ సభ్యులు సమర్ధవంతంగా భాద్యతలు నిర్వహించాలని జనరల్ అబ్జర్వర్ ప్రియాంక శుక్లా అన్నారు. పోలింగ్ స్టేషన్ రూట్ లలో ఎన్నికల నిర్వహణ సామాగ్రిని సంబంధిత సెక్టోరియల్ అధికారులు, ప్రిసైడింగ్ అధికారులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా మెటీరియల్ పంపిణీ చేయాలన్నారు .ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీటీవీలు ఏర్పాటు చేయాలన్నారు. బి ఎల్ ఓ లు ఓటరు స్లిప్పులను 100% పంపిణీ చేసే లా చూడాలన్నారు.వేసవికాలం దృష్టిలో ఉంచుకొని ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. చల్లటి త్రాగునీరు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు, 108 అంబులెన్స్, అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో షామియానాలు, కుర్చీలు, చల్లటి మంచినీరు, టెయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు ,వీల్ చైర్ లు ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.100 మీటర్ల దూరం లైన్ మార్క్ ఉండాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం ఐదు గంటలకు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాలన్నారు. సెల్ ఫోన్లు అనుమతించడం జరగదని తెలిపారు. పోలీస్ అబ్జర్వర్ రామేశ్వర్ సింగ్ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, ఎన్నికల అధికారులు సమన్వయం చేసుకుంటూ ఎన్నికల విధులు నిర్వహించాలన్నారు. లా అండ్ ఆర్డర్ అదుపులో పెట్టే బాధ్యత పోలీస్ యంత్రాంగం పై ఉందని అన్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన చెక్ పోస్టులు ఎన్నికలు పూర్తయ్యే వరకు కొనసాగుతాయని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉండాలన్నారు. వయ్య పరిశీలకులు మనోజ్ అలాయిస్ లక్రా మాట్లాడుతూ జిల్లాలో ప్రతిష్టమైన నిఘా ఏర్పాటు చేసి అక్రమంగా తరలించే మద్యం ,నగదు పై అధికారులు దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అభిలాష్ అభినవ్, డి సీ పి,నిఖిత పంత్, డి సీ పి పద్మ, అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, విజేందర్ రెడ్డి, డి ఆర్ ఓ హరిప్రియ, ఏ ఆర్ ఓ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఈటెల గెలిపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బిజెపి కార్యకర్తలు



**శామీర్ పేట, (గరుడ వార్త) :** మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటెల రాజేందర్ గెలిపే లక్ష్యంగా బిజెపి కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గురువారం తూముకుంట మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో బిజెపి నాయకులు ముమ్మర ప్రచారం చేశారు. ఈటల రాజేందర్ ను గెలిపిస్తే మల్కాజ్గిరి నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని వివరించారు. ప్రతి ఒక్కరు బిజెపి కి ఓటు వేసి ఈటెల రాజేందర్ ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రపంచంలోనే దేశానికి మోడీతో మంచి గుర్తింపు లభించిందని, తిరిగి మూడోసారి మోడీ ఏ ప్రధాని అవుతారని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కాసుల ఈశ్వర్ గౌడ్, కాసుల కరుణాకర్ గౌడ్, కాసుల సుభాష్ గౌడ్, ప్రభుదాస్ గౌడ్, అరవింద్, ప్రదీప్ నాయుడు, కళ్యాణ్ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలే కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తుంది



**శామీర్ పేట, (గరుడ వార్త) :** ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలే కాంగ్రెస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తుందని మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వజ్రేష్ యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రం శామీర్ పేట, పెద్దమ్మ కాలనీలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముందుకు సాగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని చెప్పారు. సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తే మల్కాజ్గిరి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే ఇటు రాష్ట్రంలో అటు కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలకు అనుకూలంగా మంచి పాలన అందిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వైఎస్ గౌడ్, నాయకులు మహేందర్ యాదవ్, కిషోర్ యాదవ్, అశోక్, సాయిబాబు, అశోక్ రెడ్డి, అఫ్జల్ ఖాన్, ఆంజనేయులు, ఆనంద్ గౌడ్, నరేష్ గౌడ్, బిక్షపతి, రమేష్, రవి, సోనీ, జ్యోతి, ఇందిర, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**తూముకుంట మున్సిపల్ లో...**

అలాగే తూముకుంట మున్సిపల్ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీనారాయణ, మురళి గౌడ్, మోహన్ రెడ్డి, యాదగిరి, గౌస్ బాబా, రామచంద్ర యాదవ్, జగదీష్ గౌడ్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**మూడు చింతలపల్లి మండలంలో....**

అలాగే మూడు చింతలపల్లి మండలంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సునీత మహేందర్ రెడ్డి గెలుపు ఖాయమని కాంగ్రెస్ నాయకులు ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ఎంపీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్ రెడ్డి సుపరిచితురాలని, మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్ రెడ్డి ని గెలిపించాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింలు యాదవ్, నాయకులు లక్ష్మారెడ్డి, నర్సింలు, రాజేంద్రప్రసాద్, వెంకట్ రెడ్డి, విష్ణు గౌడ్, నర్సింలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్ర అభివృద్ధి ...

**శామీర్ పేట, (గరుడ వార్త) :** బీఆర్ఎస్ ప్రభుత్వం పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి జరిగిందని రాగిడి రజిని లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం శామీర్ పేట లో కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బి ఆర్ ఎస్ ప్రభుత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాంగానే రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఒక్కటి సక్రమంగా నెరవేరుస్తలేరని విమర్శించారు. రాగిడి లక్ష్మారెడ్డి కి ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డి ని గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎల్లు



భాయి. జడ్పీటిసి అనిత, బి ఆర్ ఎస్ నాయకులు వంగ వెంకట్ రెడ్డి, ఐలయ్య యాదవ్, భూమిరెడ్డి, చాంద్ పాషా, నవీన్, సత్యనారాయణ, శ్రీకాంత్ గౌడ్, నర్సింగ్, మాధవి, అజయ్ లక్ష్మి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎమోషనల్ డ్రామాతో పదేళ్లగా మనల్ని ఫూల్స్ చేస్తున్నది.. మోదీ సర్కారుపై కేసీఆర్ విమర్శలు..



ఎమోషనల్ డ్రామాతో పదేళ్లుగా మోదీ నేతృత్వంలోని కేసీఆర్ ప్రభుత్వం ప్రజలను ఫూల్స్ చేస్తుందని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆయన కరీంనగర్‌లో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. 'ఈ పార్లమెంట్ ఎన్నికల్లో మూడు పార్టీలు మీ ముందున్నయ్. ఇందులో దేశాన్ని పాలిస్తున్న భారతీయ జనతా పార్టీ మీ ముందున్నది. ఒక్కటే మాట మనవి చేస్తున్న. పదేళ్లనాడు ఈ దేశానికి ప్రధానిమంత్రి అయ్యిండు. దగ్గర దగ్గర 150 హామీలు ఇచ్చిండు. ఏ ఒక్క హామీ అన్న నెరవేర్చిండా? సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్ ఏమన్నా అయ్యిందా? దేశ్‌కా సత్యనాశ్ అయ్యింది. అచ్చేదిన్ రాలేదు కానీ.. సచ్చేదిన్ వచ్చినయ్. పెట్రోల్, డీజిల్, ఎరువుల ధరల పెరిగినయ్. పేదలు బతకలేని పరిస్థితి వచ్చింది తప్ప అచ్చేదిన్ రాలేదు. వికసిత్ భారత్ కాలేదు కానీ.. విఫల భారత్ అయ్యింది' అంటూ మండిపడ్డారు.

'మాట్లాడితే పాకిస్తాన్‌ను చూపించాలి. పాకిస్తాన్ చిన్న దేశం. ఒక్క జాపట్ కొడితే 25 ఏళ్లు మన తెరువురాడు. వాణ్ణి చూపించి.. ఓ డ్రామా చేసి.. ఎమోషనల్ డ్రామా చేసి మనల్ని పది సంవత్సరాలు ఫూల్స్ చేస్తున్నరు. అందరూ దయచేసి ఆలోచన చేయాలి. ముఖ్యంగా యువకులు, విద్యావంతులు, మేధావులు, కరీంనగర్ పట్టణంలో, ఈ ప్రాంతంలో ఉన్న రచయితలకు దండంపెట్టి చెబుతున్న.. మోదీ చేసే ఎమోషనల్ బ్లాక్ మెయిల్ క్యారీ అయితే.. ఈ దేశం ఇప్పటికే సర్వనాశనం అయ్యింది. మోదీకన్నా ముందున్న 14 మంది ప్రధానమంత్రులు కేవలం 55లక్షల కోట్ల అప్పు చేస్తే రూ.105లక్షల కోట్ల అప్పు చేసిండు. రూపాయి విలువ పడింది. ఎగుమతులు భారత్ నుంచి నిలిచిపోయాయి. దిగుమతులు భారీగా పెరిగాయి. విదేశీ మారకద్రవ్యం నిలువ తగ్గిపోయినయ్. సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి ఒక్కటీ చేయలేదు. ఏ ఒక్క వర్గానికి దళితులు, గిరిజనులకో, మహిళలకో, పేదలకో, మైనారిటీలకో.. రైతులకో మేలు జరుగలేదు' అని ఆరోపించారు.

**మాఫీకా సౌదాగర్..**

'ఢిల్లీలో ధర్నా చేస్తే 750 మంది రైతులను మోదీ పొట్టనపట్టుకున్నడు. యూపీలో ఎన్నికలుంటే అదే రైతులకు క్షమాపణలు వేడుకొని.. గట్టెక్కిండు. ఆయనకు అప్పుడు బిరుదు ఇచ్చారు. మాఫీకా సౌదాగర్ అని చెప్పి. ఈ రకంగా ఆయనకు ఓట్లు అక్కర ఉన్నప్పుడు.. డ్రామాలు, వేషాలు కట్టి ప్రజల మధ్య చీలికలు తెచ్చి.. మతవిద్వేషాలు పెంచి.. ఒకరకమైన ద్వేషపూరిత వాతావరణం నింపుతరు తప్ప బీజేపీ ఎజెండాలో పేదల మాటల ఉండదు. కార్పొరేట్ల కోసం రూ.15లక్షల కోట్ల ప్రజల సొమ్మును బ్యాంకు రుణాలను ఆయన అబ్బసొత్తులా మాఫీ చేసిండు కానీ.. రైతులకు రూపాయి ఇవ్వలేదు. ఎవ్వరికీ మేలు జరుగలేదు. అన్నీ వట్టి డైలాగులు.. డబ్బాలో రాళ్లువేసి ఊపినట్లుగా లొడలొడ ఊపుడు తప్ప ఏ ఒక్కమాట నిజం కాలేదు. దయచేసి నా మాటను ఆషామాషీగా తీసుకోకుండా మేధావులు, విజ్ఞులు ఆలోచించాలని కోరుతున్నా'నన్నారు కేసీఆర్.

# నీ కింత... నాకింత పార్టీ ఫండ్ వాడేసుకుంటున్న నేతలు



**వరంగల్, మే9:** లోక్‌సభ ఎన్నికల వేళ.. వరంగల్ బీఆర్ఎస్ పార్టీలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఈ ఎన్నికల్లో తొలుత కడియం కావ్యను బీఆర్ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ అక్కడ ప్రకటించారు. తర్వాతి పరిణామాల్లో ఆమె పోటీకి సిద్ధపడకపోవటంతో అక్కడ మారేపల్లి సుధీర్ కుమార్‌ను తమ అభ్యర్థిగా గులాబీ బాస్ ప్రకటించారు. అయితే, కొత్త అభ్యర్థిగా బరిలో దిగిన సుధీర్ కుమార్‌కు సొంత పార్టీ నేతలే సమస్యలు సృష్టిస్తు?న్నారు. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికల కోసం అధిష్ఠానం పంపిన పార్టీ ఫండ్‌ను జిల్లాకు చెందిన మాజీ మంత్రి, వరంగల్ పార్లమెంటు పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు కలిసి పంచుకున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామంతో బిత్తర పోయిన సుధీర్ కుమార్ పార్టీ పెద్దలకు ఈ విషయం చెప్పి వాపోయినట్లు సమాచారం. ప్రత్యర్థులు ఇంటింటా ప్రచారం ప్రారంభించి మహిళా కార్యకర్తలతో బొట్టు, మెహందీ వంటి కార్యక్రమాలు చేస్తుండగా తాము ప్రచారంలో పూర్తిగా వెనకబడిపోయామని ఆయన అధిష్ఠానంతో మొరపెట్టుకున్నట్లు తెలుస్తోంది.సాధారణంగా లోక్‌సభ ఎన్నికల వేళ బూత్ కమిటీలు ఏర్పాటు చేయటం, మండలస్థాయిలో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నేతలు ప్రచారంలో పాల్గొనటం తెలిసిందే. వీటి నిర్వహణ కోసం పార్టీలు తమవంతుగా కొంత సొమ్మును పంపుతుంటాయి. అవసరాన్ని బట్టి అభ్యర్థులు తమ వాటాను కూడా జోడించి, గ్రామాల వారీగా బూత్‌లలో పోలింగ్ రోజున తమ ఓట్ల సంఖ్యను పెంచుకునే ప్రయత్నం చేస్తుంటారు. కానీ, ఈసారి ఇంతవరకు బూత్ కమిటీలకు నయా పైసా అందకపోవటంతో ఆ నేతలంతా నిరాశలో కూరుకుపోయారు. మరోవైపు గతంలో ఇక్కడ సీటు కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెడతామని తిరిగిన నేతలెవరూ ఇప్పుడు నియోజక వర్గంలో కనిపించటం లేదు. వరంగల్ సీటు పరిధిలో విపక్ష బీజేపీ, అధికార కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే గ్రామాల స్థాయి ప్రచారం చేస్తుంటే, తమ పార్టీ నేతలు ఇల్లు కదలకపోవటం పట్ల గులాబీ పార్టీ కేడర్ మండిపడుతోంది. పదేళ్ల తమ పాలనలో మంత్రిగా ఉన్న నేత, ఆయా సెగ్మెంట్లలో ఎమ్మెల్యేలుగా బాగా సంపాదించుకున్న తమ పార్టీ నేతలు చివరికి ఎన్నికల కోసం పంపిన పార్టీ ఫండ్‌ను వాటాలు వేసుకుని మరీ పంచుకు తినటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.మరో 3 రోజుల్లో ప్రచార పర్వం ముగియబోతుంటే, ఈ చిల్లర వేషాలేంటని అటు పార్టీ అధిష్టానం కూడా చిలక్కొట్టుడు నేతల మీద మండిపడినట్లు సమాచారం. ఎన్నికలంటేనే అందర్నీ కలుపుకొనిపోవాలని, పదేళ్ల పాటు పదవులు అనుభవించిన నేతలు.. పార్టీ ఫండ్‌కు తమ వాటా వేసి, అక్కడి అభ్యర్థిని గెలిపించాల్సింది పోయి, ఇలాంటి చౌకబారు వేషాలు వేస్తే జనానికి ఎలాంటి సందేశం పోతుందని పార్టీ పెద్దలు వాటాలు పంచుకున్న ప్రజాప్రతినిధులను మందలించినట్లు సమాచారం. చివరి నాలుగు రోజులైనా సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు ప్రచారంలో పాల్గొనాలని, ద్వితీయ శ్రేణి నాయకులను కలుపుకుని సుధీర్ కుమార్ గెలుపుకు కృషి చేయాలని పార్టీ ఎన్నికల వ్యవహారాల బాధ్యులు వరంగల్ నేతలను బతిమిలాడుకుంటున్నారని సమాచారం.

# అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో భయం..భయం



హైదరాబాద్, మే 9:పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్ చార్జులుగా ఉన్న కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు సీరియస్‌గా క్యాంపెయిన్ చేస్తున్నారు. ఒకవేళ అనుకున్న ఫలితాలు రాకపోతే అధిష్టానం నుంచి చివాట్లు తప్పవనే ఆందోళన వారిలో కనిపిస్తున్నది. రెండురోజుల క్రితం కేసీ వేణుగోపాల్ ఎన్నికల ప్రచారం తీరుపై మంత్రులు, ఎమ్మెల్యేలు, అభ్యర్థులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఇందులో కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేయడంతో, సదరు లీడర్లలో కదలిక వచ్చినట్టు తెలుస్తున్నది. ఈనెల 10,11 తేదీల్లో ఏఐసీసీ నేతలు రాహుల్, ప్రియాంక గాంధీ రాష్ట్రానికి రానున్నారు. దీంతో వారు పాల్గొనే సభలు, రోడ్డుషోల విజయవంతానికి ప్రత్యేక దృష్టిపెట్టారు.లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపోటములు మంత్రులు, ఎమ్మెల్యేలకు చాలెంజ్‌గా మారాయి. ఇన్ చార్జులుగా ఉన్న స్థానాల్లో అభ్యర్థులు గెలిస్తే పదవులు దక్కుతాయని, ఓడితే ఉన్న పదవులు ఊడుతాయనే సంకేతాలను అధిష్టానం ఇచ్చినట్టు చర్చ జరుగుతున్నది. ఈ విషయాన్ని గ్రహించిన కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు తమ సొంత ఎన్నికల కంటే ఎక్కువ సీరియస్‌గా తీసుకుని పనిచేయాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.ప్రధానంగా గట్టి పోటీ ఉన్న సెగ్మెంట్లలో పార్టీ అభ్యర్థి విజయం కోసం పలు రకాలు వ్యూహాలను అమలు చేసేందుకు రెడీ అయ్యారు. ఇప్పటివరకు ఎన్నికల ప్రచారం చేయని ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల్లో పర్యటించేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. అలాగే పోల్ మేనేజ్మెంట్‌పై కూడా దృష్టి పెట్టినట్టు తెలుస్తున్నది. ఏ విధంగా పోల్ మేనేజ్మంట్ చేయాలో తమ కేడర్‌కు ఇప్పటికే దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ఈనెల 10, 11 తేదీల్లో రాష్ట్రానికి రాహుల్, ప్రియాంక రానున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే సభలు, రోడ్డు షోల సక్సెస్ కోసం ప్లాన్ చేస్తున్నారు.తమ సొంత నియోజకవర్గాల్లో ఓటింగ్‌పై మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కువ ఫోకస్ పెట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమకు వచ్చిన ఓట్ల కంటే లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు రాబట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఒకవేళ తక్కువ ఓట్లు వస్తే, హైకమాండ్ నుంచి చివాట్లు తప్పవనే ఆందోళన వారిలో కనిపిస్తున్నది. అందుకని నియోజకవర్గంలోని పలు వర్గాలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల ఓట్లు రాబట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలోని మైనార్టీ ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు కాంగ్రెస్ లీడర్లు ప్రయత్నాలు చేస్తున్నారు.ఎన్నికల ప్రచారంలో మంత్రులు, ఎమ్మెల్యేల కదలికలపై కాంగ్రెస్ అధిష్టానం ఎప్పటికప్పుడు రిపోర్టులు తెప్పించుకుంటున్నది. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికలను సీరియస్ గా తీసుకోవడం లేదని ఫిర్యాదులు వెళ్లాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్ సీరియస్‌గా క్లాస్ తీసుకున్నట్టు పార్టీ వర్గాల్లో ప్రచారం ఉంది. పోలింగ్ ముగిసేవరకు లీడర్ల ప్రచారం, పోల్ మేనేజ్మెంట్‌పై కూడా అధిష్టానం ఫోకస్ పెట్టినట్టు తెలుస్తున్నది.

# కాంగ్రెస్ కు తలనొప్పిగా మారిన పిట్రోడా



న్యూఢిల్లీ, మే 9: దక్షిణాది భారతదేశానికి చెందినవారు ఆఫ్రికన్ల లాగా, ఈశాన్య భారతదేశంలో ప్రజలు చైనీయుల లాగా, ఉత్తర భారత దేశానికి చెందినవారు తెల్లగా, పశ్చిమ భారతదేశంలో వారు అరబ్బుల్లాగా కనిపిస్తారని కాంగ్రెస్ పార్టీ ఓవర్సీస్ చీఫ్ శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు ఎన్నికల ముందు దేశంలో పెద్ద దుమారానికి కారణమయ్యాయి. శామ్ చేసిన ఈ వ్యాఖ్యలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్రంగా పరిగణించారు. “ఇది కాంగ్రెస్ పార్టీ వారి అసలు ముఖచిత్రం. వారు వారసత్వ పన్ను వేస్తారు. దేశాన్ని విభజిస్తారు. ఒక కుటుంబం కోసం ఏదైనా చేస్తారు. శామ్ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం కాదు. అవి కాంగ్రెస్ పార్టీ అసలు ముఖచిత్రాన్ని ప్రదర్శిస్తున్నాయని” మోడీ విమర్శించారు. ఇక ఎన్నికల ముందు శామ్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ కి ఇబ్బంది కలగజేస్తున్నాయి.. సోషల్ మీడియాలో సైతం శామ్ పై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చాలామంది ఇండియా కూటమి, రాహుల్ గాంధీ ని టార్గెట్ చేసుకొని ఆరోపణలు చేస్తున్నారు. ఇంటా బయటా విమర్శలు తీవ్రం కావడంతో శామ్ పిట్రోడా తన పదవికి రాజీనామా చేశారు.శామ్ పిట్రోడా ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఓవర్సీస్ చైర్మన్ గా కొనసాగుతున్నారు. బుధవారం ఆయన చేసిన వ్యాఖ్యలు పెను దుమారానికి కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నష్ట నివారణ చర్యలకు దిగింది. అధిష్టానం అంతరంగాన్ని అర్థం చేసుకున్న శామ్ పిట్రోడా తన పదవికి రాజీనామా చేశారు. దీనిని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించారు. శామ్ పిట్రోడా రాజీనామాను కాంగ్రెస్ పార్టీ సీనియర్ జై రామ్ రమేష్ ట్విట్టర్ ఎక్స్ ద్వారా ప్రకటించారు. వాస్తవానికి శామ్ పిట్రోడా అలాంటి వ్యాఖ్యలు చేసే ముందు కొంచెం జాగ్రత్తగా ఉండాల్సింది. ప్రస్తుతం దేశభక్తి అనేది తారాస్థాయిలో ఉన్న నేపథ్యంలో.. ఒక బాధ్యత గల రాజకీయ నాయకుడిగా ఆయన అలాంటి వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీకి ప్రతిబంధకంగా మారింది.. ఆఫ్రికన్లు, చైనీయులు, అరబ్బులతో భారతదేశ ప్రజలను పోల్చడం నిజంగా శామ్ పిట్రోడా అవివేకానికి నిదర్శనం.శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు మంటలు రేపుతున్న నేపథ్యంలో.. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ వివాదంపై నోరు మెదపకుండా సైలెంట్ గా ఉన్నారు. శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యల పట్ల మేధావులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. “కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అనేక విప్లవాత్మక నిర్ణయాలను తెరపైకి తీసుకొచ్చిన వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని”అంటున్నారు.. మరోవైపు ఈ వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదని, అటువంటి వాటిని ఇండియా కుటమి సమర్థించదని ఆప్ నేత సంజయ్ సింగ్ పేర్కొన్నారు. శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో.. సోషల్ మీడియాలో ఆయనకు వ్యతిరేకంగా పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.. నిన్నటిదాకా ప్రజ్వల్ ఉదంతంతో తీవ్రంగా ఇబ్బంది పడ్డ భారతీయ జనతా పార్టీకి..శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలతో కాస్త ఉపశమనం లభించినట్టయింది.

# ఊరెళ్తున్న మహా నగరం



**హైదరాబాద్, మే 9:** : ఎన్నికలకు మరో 3 రోజుల సమయం మాత్రమే ఉండడంతో నగర ప్రజలు తమ సొంతూళ్లకు పయనం అవుతున్నారు. పిల్లలకు వేసవి సెలవులు, ఇటు ఎన్నికలు ఉండడంతో వారం రోజుల ముందే ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళుతున్నారు. ఈనెల 13న తెలంగాణలో లోక్ సభ ఎన్నికలకు పోలింగ్......ఆంధ్రప్రదేశ్ లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. ఏపీకి చెందిన నగరవాసులకు హైదరాబాద్ తో పాటు తమ సొంత గ్రామాల్లో కూడా ఓటు హక్కు ఉండడంతో.... గ్రామాల్లో తమ ఉనికిని కాపాడుకోవడం కోసం అక్కడ కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళుతున్నారుహైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్లే ఆర్టీసీ బస్సులకు, రైళ్లకు భారీ డిమాండ్ పెరిగింది. హైదరాబాద్ నుంచి విశాఖ, తిరుపతి, కాకినాడ, గుంటూరు ప్రాంతాలకు వెళ్లే రెగ్యులర్ ట్రైన్స్ ఇప్పటికే రద్దీ పెరుగుతుంది. ఎండాకాలం కావడంతో ఏసీ కోచ్ లలో రిజర్వేషన్లు కూడా త్వరగా ముగుస్తున్నాయి. ఇటు దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినప్పటికీ......గడిచిన రెండు రోజుల్లో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిందని రైల్వే అధికారులు వెల్లడించారు.సాధారణంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి రోజుకు 1.85 లక్షలు రాకపోకలు సాగిస్తే.....గత కొద్ది రోజులుగా ఆ సంఖ్య దాదాపు 3 లక్షలకు చేరిందని అధికారులు అంటున్నారు. అయితే ఈసారి సాఫ్ట్వేర్ ఉద్యోగులు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు, కార్మికులు, వాచ్ మెన్లు, సెక్యూరిటీ గార్డులుగా పని చేసే లక్షలాది మంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపడం గమనార్హం. ఇదిలా ఉంటే హైదరాబాద్ లో స్థిరపడ్డ ఏపీ ప్రజలను తమ సొంతూళ్లకు తరలించేందుకు రాజకీయ పార్టీలు ప్రైవేట్ బస్సులను కూడా ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాయట.హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులకు సైతం భారీగా డిమాండ్ పెరిగింది. సుమారు 1500 ఆర్టీసీ బస్సులు ఏపీలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనపు బస్సులను నడిపేందుకు ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆలోచిస్తుంది. ఇటు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సైతం హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సుల సంఖ్యను పెంచేందుకు యోచిస్తోంది. ఆర్టీసీ బస్సుల సంగతి ఇలా ఉంచితే.....అటు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు సైతం విపరీతంగా డిమాండ్ పెరుగుతుంది. ఇదే అదునుగా ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు దండుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారట. ప్రైవేట్ బస్సులో బుకింగ్స్ కూడా పెరిగిపోయాయి. సాధారణం కంటే నగరంలో 1000 ప్రైవేట్ బస్సులు అదనంగా ఏపీకి రాకపోకలు సాగిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన రద్దీ ప్రాంతాలైన ఉప్పల్, ఎల్బీ నగర్, సికింద్రబాద్, కేపీహెచ్బీ నుంచి అధిక బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి

# కేరళలో కొత్త జ్వరం.. 'వెస్ట్ నైల్



**తిరువనంతపురం, మే 9:** కేరళలో కొత్త జ్వరం 'వెస్ట్ నైల్' కలవర పెడుతోంది. ఈ జ్వరం వల్ల తీవ్ర అస్వస్థతకు గురి కావడమే కాకుండా ప్రాణాపాయం కూడా ఉందని వైద్య అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య అధికారులు ఇప్పటికే అప్రమత్తం చేశారు. ఈ రాష్ట్రంలోని మల్లప్పురం, కోజికోడ్, త్రిసూర్ వెస్ట్ నైల్ కేసులు నమోదైనట్లు వైద్య అధికారులు తెలిపారు. వెస్ట్ నైల్ అనే దోమ వల్ల ఈ వ్యాధి ప్రబలుతుందని, ఈ వ్యాధికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి మందులు లేవని, వ్యాక్సిన్ సైతం ఇంకా గుర్తించలేదని అంటున్నారు. అయతే ఈ జ్వరం లక్షణాలు ఎలా ఉంటాయి? ఇది రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏవో చూద్దాం..వెస్ట్ నైల్' అనే జ్వరాన్ని 1937లో ఉగాండాలో కనుగొన్నారు. మనదేశంలో దీని ద్వారా 2019లో ఓ బాలుడు చనిపోవడంతో ఇది వెలుగులోకి వచ్చింది. ప్రతీ మాన్ సూన్ కు ముందుగా ఈ వ్యాధి ప్రబలుతుందని వైద్యులు చెబుతున్నారు. వెస్ట్ నైల్ ఫీవర్ ద్వారా ప్రాణాపాయం ఉన్నప్పటికీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అంటున్నారు. అయితే దీనికి సంబంధించిన కొన్ని లక్షణాలు కనిపిస్తే మాత్రం వెంటనే వైద్యులను సంప్రదించాలని అంటున్నారు.క్యూలెక్స్ జాతికి చెందిన వెస్ట్ నైల్ అనే దోమ కాటు వల్ల ఈ జ్వరం వస్తుంది. ఇది ఉన్న వారు తలనొప్పితో పాటు జ్వరం, తల తిరగడం, కండరాల నొప్పుల వంటి వాటితో అస్వస్థతకు గురవుతారు. అయితే వెస్ట్ నైల్ సోకిన వెంటనే కాకుండా కొన్ని రోజుల తరువాత ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఇది ఎక్కువగా మెదడుపై ప్రభావం చూపుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు చనిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు.వెస్ట్ నైల్ కు ఎలాంటి ఔషధాలు లేవని వైద్యులు తెలుపుతున్నారు. ఇప్పటి వరకు వ్యాక్సిన్ కూడా కనుగొనలేదని పేర్కొంటున్నారు. అందువల్ల ముందు జాగ్రత్తగా దోమలు కుట్టకుండా జాగ్రత్త పడాలని అంటున్నారు. అయితే ఈ జ్వరం సోకిన వారికి లక్షణాల ఆధారంగా చికిత్స చేస్తారని అంటున్నారు. లేటేస్టుగా మూడు జిల్లాల్లో వెస్ట్ నైల్ కేసులు నమోదయ్యాయని, ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ మంత్రి తెలిపారు.

# ఎమ్మెల్యేలకు వేణుగోపాల్ స్వీట్ వార్నింగ్



హైదరాబాద్: ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగానే వారికి పదవులు ఉంటాయని ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఎన్నికలకు మరో ఐదు రోజులే ఉన్నందున రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ కాంగ్రెస్ నాయకులతో జూమ్ ద్వారా అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, దీపాదాస్ మున్షీ, మంత్రు లు, ఎమ్మెల్యేలు, లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థులు, ఇన్‌చార్జీలు పాల్గొన్నారు. ఈ భేటీకి మంత్రి దామోదర రాజనర్సింహ, 15 మం ది ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడంపై కెసి వేణుగోపాల్ అసహనం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప లువురు నేతల పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.గంటకు పైగా సాగిన ఈ జూమ్ మీటింగ్‌లో పార్టీ నేతలకు ఆయన దిశానిర్దేశం చే శారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల ప్రచారం, నియోజకవర్గాల్లో పా ర్టీల బలాబలాలు తదితరాల అంశాలపై సిఎం రేవంత్ రెడ్డి, విక్రమార్క, దీపాదాస్ మున్షీ, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు వివరించా రు.ఈ సందర్భంగా కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ తెలంగాణలో అధిక స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించబోతుందని, అందుకో సం మరింత ఉత్సాహంతో పని చేయాలని ఆయన సూచించారు. తెలంగాణాలో అధిక స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించబోతుందని ఆయన పేర్కొన్నారు.నల్గొండ లోక్‌సభ నియోజకవర్గ బాధ్యతను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి చూసుకుంటారని కెసి వేణుగోపాల్ స్పష్టం చేశారు. సికింద్రాబాద్ స్థానాన్ని నిర్లక్ష్యం చేయటంపై ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై కెసి వేణగోపాల్ అసహనం వ్యక్తం చేశారు. అభ్యర్థి గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆయన నిర్దేశించారు. నియోజకవర్గంలోనే ఉండి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేలను, మంత్రులను సమన్వయం చేయటంలో సరిగా వ్యవహరించడం లేదంటూ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌పై కెసి వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం 'దిశా దశ' మార్చే ఈ ఎన్నికలను ఎమ్మెల్యేలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆయన ఆదేశించారురు. ఎమ్మెల్యేలు ఎవరూ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించ వద్దని కెసి వేణగోపాల్ హెచ్చరించారు.పెండింగ్‌లో ఉన్న రైతుబంధు కూడా ఇప్పటికే పంపిణీ పూర్తి చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సమావేశంలో వెల్లడించారు. త్వరలో రుణమాఫీ సైతం చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. పార్టీ నిర్ధేశించిన పనిని ప్రతి ఒక్కరూ పూర్తి చేయాలని, పార్టీ నిర్ణయాలను ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని సిఎం సూచించారు. జూమ్ మీటింగ్‌లో ఎవరెవరు పాల్గొనలేదో నివేదిక ఇవ్వాలని మహేశ్‌కుమార్ గౌడ్‌ను కెసి వేణుగోపాల్ ఆదేశించారు.

# కాంగ్రెస్, బీజేపీ లకు ఓట్లేసి మరోసారి మోసపోవద్దు

## - మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



**సికింద్రాబాద్ :** మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యదవ్ గురువారం బేగంపేట లో సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించార. తలసాని మాట్లాడుతూ నిత్యం అందుబాటులో ఉండేవారు, అభివృద్ధి కి కృషి చేసే వారినే ఎన్నుకోండని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ లకు ఓట్లేసి మరోసారి మోసపోవద్దని అన్నారు.

## హుస్నాబాద్ లో మంత్రి పొన్నం పర్యటన



**హుస్నాబాద్:** హుస్నాబాద్ మున్సిపాలిటీ మొదటి వార్డు లోని కస్తుర్బా కాలనీ లో మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పొన్నం మాట్లాడుతూ కేబి కాలని లో ఇళ్లు లేని వారికి మొదట ఇళ్లు మంజూరు చేస్తాం. ప్రచారంలో ఇళ్లు చూసి బాధపడ్డ..దానిని అసెంబ్లీ లో మాట్లాడిన. గత ప్రభుత్వం హుస్నాబాద్ పట్టణంలో కేబీ కాలని ఇంట్లో నివసిస్తున్నారు చనిపోతే మాకు సంబంధం లేదని బోర్డు రాసిన ప్రభుత్వం అది. కేసిఆర్ తెలంగాణ లో 10 ఏళ్లు అధికారంలో ఉండి 2 వేల పెన్షన్ తప్ప ఏం చేశారు. డబుల్ బెడ్రూం ఇచ్చారా..? దళితులకు 3 ఎకరాల భూమి ఇచ్చారా..? దళిత బంధు వచ్చిందా..? ఉద్యోగాలు వచ్చాయా..? రుణమాఫీ చేయలేదని అన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 5 నెలలు అవుతుంది. ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నాం. 500 కి గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం..ఎవరికైనా రాకపోతే అధికారులకు చెప్పండి. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. మీకు కరెంట్ బిల్లు లేకుండా చేస్తున్నాం. 10 లక్షల ఆరోగ్య శ్రీ ఇస్తున్నాం.. ఎవరికైనా ఆరోగ్యం ఇబ్బంది ఉంటే నాకు చెప్పండి....నేను చికిత్స చెపిస్త. ఎన్నికలు పూర్తికాగానే కొత్త పెన్షన్లు ఇస్తాం.. ఇప్పుడున్న పెన్షన్లు 4 వేలకు పెంచుతాం. రేషన్ కార్డులు ఇస్తాం.. గత 10 ఏళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నాం..కేబీ కాలని కి ఇచ్చిన తరువాతనే వేరే వాళ్ళకి ఇళ్లు ఇస్తాం. మహా లక్ష్మి ద్వారా 2500 ఇస్తాం. బీజేపీ , బిఆర్ఎస్ లకు ఓటు వేసి వృదా చేసుకోవద్దు. మాకు ఓటు వేసి గెలిపించండి. నేను పేదల వర్గాల నుండి వచ్చిన..మీ సమస్యలు నాకు తెలుసని అన్నారు.

## 3 రోజులు మందు షాపులు బంద్




**హైదరాబాద్, మే 9:** రాష్ట్రంలో ఈ నెలలో ఎన్నికల సందర్భంగా మూడు రోజులపాటు వైన్స్ షాపులు మూసివేయనున్నారు. ఈ నెల 11, 12, 13వ తేదీల్లో వైన్స్ షాప్‌లు బంద్ చేయనున్నారు. మే 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం వరకు ఈ మందు దుకాణాలు మూసే ఉంటాయి. మన రాష్ట్రంలో 13వ తేదీన పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. పోలింగ్ తేదీకి ముందు రెండు రోజుల పాటు ప్రచారం ముగుస్తుంది. ప్రలోభాల పర్వం అసలే జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటారు. ఇందులో భాగంగా వైన్స్ షాపులు బంద్ చేయనున్నారు. పోలింగ్ తేదీతోపాటు కౌంటింగ్ రోజున కూడా వైన్స్ షాప్‌లు మూసివేయనున్నారు. లోక్ సభ ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడనున్నాయి. కాబట్టి, 4వ తేదీన ఉదయం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వైన్స్ షాప్‌లు బంద్ కానున్నాయి. ఈ తేదీల్లో రాష్ట్రంలోని అన్ని వైన్స్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌లు మూసివేస్తారు.సార్వత్రిక ఎన్నికలు ఏడు విడతల్లో జరుగుతున్నాయి. ఇందులో తెలంగాణలో నాలుగో విడతలో పోలింగ్ జరగనుంది. తెలంగాణలో 17 లోక్ సభ ఎన్నికలకు, ఏపీలోని 25 లోక్ సభ స్థానాలకు అలాగే 175 అసెంబ్లీ స్థానాలకు నాలుగో విడతలో భాగంగా ఈ నెల 13వ తేదీన పోలింగ్ జరుగుతుంది. అన్ని విడతల పోలింగ్ ముగిశాక ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేదీన నిర్వహిస్తారు.

## మెదక్ కోసం రంగంలోకి కేసీఆర్



**మెదక్, మే 9 :**రాష్ట్రంలో లోక్ సభ ఎన్నికల పోలింగ్ తేదీ సమీపిస్తోంది. ప్రధాన పార్టీలు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. ఇక రోడ్ షో ద్వారా ప్రజల్లోకి వెళ్తున్న కేసీఆర్? మెదక్ లోక్ సభ నియోజకవర్గంపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టారు.ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ ఏదైనా లోక్ సభ స్థానంలో తప్పకుండా గెలుస్తుందని ఆ పార్టీ గట్టి నమ్మే లిస్ట్ లో మెదక్ ఫస్ట్ ప్లేస్ లో ఉంటుంది. బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు తర్వాత? మెదక్ లోక్ సభ నియోజకవర్గానికి జరిగిన ఐదు ఎన్నికల్లో కూడా గులాబీ జెండానే ఎగిరింది.గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ఈ లోక్ సభ పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆరు నియోజకవర్గాలలో బీఆర్ఎస్ పార్టీ పాగా వేసింది. ఫలితంగా ఇక్కడ ప్రత్యర్థి పార్టీల కంటే బలంగా ఉందిఅధికారం కోల్పోవటంతో మెదక్ పార్లమెంట్ సెగ్మెంట్ లో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి మారిపోయింది. ఆరు స్థానాల్లో గెలిచినప్పటికీ? ఈసారి ఇక్కడ గెలవటం అతిపెద్ద సవాల్ గా మారింది. ఓవైపు కాంగ్రెస్ అధికార పార్టీగా, మరోవైపు మోదీ మ్యానియాతో బీజేపీ బలమైన ప్రత్యర్థిగా బరిలో ఉన్నాయి. దీంతో ఇక్కడ కూడా బీఆర్ఎస్ తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది.ఇక కేసీఆర్ సొంత జిల్లా కావటం కూడా బీఆర్ఎస్ ఈ సీటు సవాల్ గా మారింది. హరీశ్ రావుతో పాటు కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న అసెంబ్లీ స్థానాలు కూడా ఈ సెగ్మెంట్ పరిధిలోకే వస్తాయి. మారిన పరిస్థితుల దృష్ట్యా? స్వయంగా కేసీఆరే ఈ సీటుపై ఫోకస్ పెట్టారు.కేసీఆర్ రోడ్డుషో లతో పాటు పబ్లిక్ మీటింగ్ ద్వారా తన విజయం సులువుగా మారుతుందని పార్టీ అభ్యర్థి పి వెంకట్రామి రెడ్డి భావిస్తున్నారు.

# బాచుపల్లిలో విషాదంరేవంత్ ఆరా




**హైదరాబాద్, మే 8**హైదరాబాద్ సమీపంలోని బాచుపల్లిలో విషాదం చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న గోడ కుప్పకూలింది. ఈ నిర్మాణం సమీపంలో ఉన్న ఏడుగురు ఈ శిథిలాల్లో చిక్కుకొని ప్రాణాలు వదిలేశారు. బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రేణుక ఎల్లమ్మ కాలనీలో ఈ విషాదం జరిగింది. స్థానికంగా ఓ బిల్డింగ్‌ను నిర్మిస్తున్నారు. అందులో పని చేసేవాళ్ల కోసం ఓ షెడ్ ఏర్పాటు చేశారు. అయితే రాత్రి కురిసిన వర్షానికి ఆ నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ సెంట్రింగ్ రాడ్స్ ఒరిగిపోయాయి. దీంతో అవి ఒక్కసారిగా పక్కనే కార్మికులు ఉంటున్న షెడ్‌పై పడ్డాయి. షెడ్‌లో ఉన్న వారిపై ఒక్కసారిగా స్లాబ్ సెంట్రింగ్ రాడ్లతో పడినందుకు వాళ్లెవరూ బయటకు రాలేకపోయారు. దీంతో పెను ప్రమాదం జరిగింది. ప్రమాదం విషయాన్ని తెలుసుకున్న పోలీసులు, జీహెచ్ఎంసీ, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు అక్కడకు చేరుకున్నాయి. జేసీబీల సాయంతో ఏడు మృతదేహాలను వెలికి తీశాయి. మృత్యువాత పడిన వారంతా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తించారు. ఘటన స్థలానికి చేరుకున్న కూకట్‌పల్లి ఏసీపి శ్రీనివాసరావు ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీశారు. రైజ్ డెవెలపర్స్ కన్స్ట్రక్షన్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఘటన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.బాచుపల్లి ఘటనపై సిఎం రేవంత్ రెడ్డి ఆరా తీశారు. మేడ్చల్ జిల్లా బాచుపల్లిలోని రేణుక ఎల్లమ్మ కాలనీలో నిర్మాణంలో ఉన్న గోడకూలి ఏడుగురు చనిపోవడంపై సిఎం రేవంత్ రెడ్డిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై అధికారులను సిఎం వివరాలను అడిగి తెలుసుకున్నారు. తప్పిదం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. బాచుపల్లి ఘటనపైగ్భ్రాంతి వ్యక్తం చేసిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.మంగళవారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షానికి బాచుపల్లిలో నిర్మాణంలో ఉన్న అపార్ట్మెంట్ గోడకూలి ఏకంగా ఏడుగురు కార్మికుల మృతి చెందారు. ఆరిజన్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు చెందిన ప్రాజెక్టు సైట్‌లో ప్రమాదం జరిగింది. రిటర్నింగ్ వాల్ నిర్మాణంలో నాణ్యతాలోపం ఉందని డీసీపీ శ్రీనివాసరావు చెప్పారు. భవన యజమాని అరవింద్‌రెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు.మృతులందరూ ఒడిశా రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. సెంట్రింగ్ పనుల కోసం వచ్చిన కార్మికులు.. కన్‌స్ట్రక్షన్ సైట్‌లోనే రేకుల షెడ్డు వేసుకుని ఉంటున్నారు.

# ఎన్నికల పనుల్లో చేతి వాటం

**హైదరాబాద్, మే 9:** ఎలక్షన్స్ వచ్చాయంటే చాలు వారికి ఫుల్ హ్యాపీ.... వాస్తవానికి వారు జీహెచ్ఎంసీలో పనులు చేయించాల్సిన ఇంజినీర్లు. కానీ ఎన్నికలొచ్చాయంటే చాలు వారు కాంట్రాక్టర్లుగా మారిపోతారు. అడపాదడపా పనులు చేయించే లైసెన్స్ కలిగిన కాంట్రాక్టర్లను బినామీలుగా పెట్టుకుని పబ్బం గడుపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఎన్నికలకు సంబంధించి లైటింగ్, వీడియో, డీఆర్సీ సెంటర్లు, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు పనులు, స్ట్రాంగ్ రూమ్‌ల నిర్మాణం, డీఆర్సీ సెంటర్లలోని సిబ్బందికి భోజనాలు వంటి పనులను కొటేషన్లు, షార్ట్ టెండర్ల ప్రక్రియలతో కేటాయించాలని గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే జిల్లా ఎన్నికల అధికారి లిఖితపూర్వకమైన ఆదేశాలు జారీ చేసినా క్షేత్ర స్థాయిలో అవి ఏమాత్రం అమలు కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి అడ్డదారిలో ఎలక్షన్స్ పనులు చేజిక్కించుకుని తమ బినామీ కాంట్రాక్టర్లకు కట్టబెడుతూ జీహెచ్ఎంసీ ఇంజినీర్లు, అధికారులు అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలతో పాటు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఏ పనికైనా టెండర్ల ప్రక్రియ చేపట్టి, అందులో తక్కువగా కోడ్ చేసిన కాంట్రాక్టర్‌కు గానీ, సంస్థకు గానీ పనులు కేటాయించాల్సి ఉంది. మరీ అర్జెంట్ అయితే కనీసం కొటేషన్లను తీసుకోనైనా, లేక షార్ట్ టెండర్ల ప్రక్రియను నిర్వహించైనా పనులు చేపట్టాలని నిబంధనలు చెబుతుంటే జీహెచ్ఎంసీ ఇంజినీర్లు మాత్రం పనులను నామినేషన్ పద్ధతిని కట్టబెడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకే జిల్లా ఎన్నికల అధికారి లిఖిత పూర్వకమైన ఆదేశించినట్లు సమాచారం. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ జోన్‌లోని నాంపల్లి నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూం నిర్మాణ పనులను ఓ ఇంజనీర్ చేజిక్కించుకుని తన ఇద్దరు బినామీ కాంట్రాక్టర్లతో పనులు చేయించిన విషయం ఇటీవలే బయటపడినా కమిషనర్ ఎందుకు చర్యలు తీసుకోలేదన్న విషయం చర్చనీయాంశంగా మారింది.ఇప్పుడు కూడా పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మాసాబ్ ట్యాంక్ సాంకేతిక భవన్‌లో నిర్మించిన




నాంపల్లి నియోజకవర్గం స్ట్రాంగ్ రూమ్ నిర్మాణ పనులు సదరు ఇంజినీరే చేజిక్కించుకున్నట్లు చర్చ జరుగుతుంది. పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట నియోజకవర్గానికి చెందిన ఆఫీసర్ నిజాంకాలేజీలో ఏర్పాటు చేసిన డీఆర్సీ సెంటర్‌లోని స్టాఫ్‌కు టీ, టిఫిన్, భోజనాలకు సంబంధించిన కాంట్రాక్టును చేజిక్కించుకున్నట్లు సమాచారం. సదరు ఆఫీసర్ ఆ టీ, టిఫిన్, భోనాలను నిజాం కాలేజీ క్యాంటీన్ నుంచే సమకూర్చి భారీగా అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇదే రకంగా ఖైరతాబాద్ జోన్‌లో మరో ఇంజినీర్, ఉప్పల్‌లో ఓ ఇంజినీర్ పనులు చేజిక్కించుకున్నట్లు సమాచారం.ఎలక్షన్ పనులను నిబంధనలు ఉల్లంఘించి నామినేషన్ పద్ధతిన కేటాయిస్తున్నా, ఉన్నతాధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారన్నది చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నాంపల్లి నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్ నిర్మాణ పనులు ఖైరతాబాద్ జోన్‌లోని మెహిదీపట్నంకు చెందిన ఇంజినీర్ చేపట్టిన విషయం ఇటీవలే బట్టబయలైన, కమిషనర్ గానీ, జిల్లా ఎన్నికల అధికారి గానీ, ఇంజనీర్ ఇన్ చీఫ్ గానీ ఎందుకు చర్యలు చేపట్టలేదన్న విషయం హాట్ టాపిక్‌గా మారింది. అడ్డదారిలో పనులు చేజిక్కించుకుంటున్న ఇంజనీర్ల కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు ఎవరి వాటాలు వారికి అప్పగించటమే వారిపై చర్యలు తీసుకోకపోవడానికి ప్రధాన కారణమా? అంటూ జీహెచ్ఎంసీ సిబ్బంది చర్చించుకోవడం కనిపించింది

# మా ఊళ్లో ఆడపిల్ల పుడితే రూ. 2వేలు



**నిజామాబాద్:** కాలం మారింది... కంప్యూటర్ యుగం వచ్చింది... అయినా ఆడపిల్లలపై ఉన్న వివక్ష మాత్రం పూర్తిగా పోలేదు. ఆడపిల్ల అంటే భారమే అనుకునే తల్లిదండ్రులకు కూడా ఇంకా ఉన్నారు. సమాజంలో లింగవివక్ష.. అక్కడో ఇక్కడో ఎక్కడో ఉంటూనే ఉంది. ఎన్ని చట్టాలు వచ్చినా... గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ పరీక్షలు జరుగుతూ ఉన్నాయి. కడుపులో ఆడపిల్ల ఉందని తెలిస్తే... కడుపులో చంపేస్తున్న వాళ్లూ ఉన్నారు. అంతేకాదు... ఆడపిల్ల పుట్టిందని ముఖం మాడ్చుకునే తండ్రులూ ఉన్నారు. అమ్మాయి పుట్టిందని... పురిటిలోని బిడ్డను చెత్తకుప్పల్లోనే.. చెత్తకుండీల్లో పడేస్తున్న సంఘటనలు అప్పుడప్పుడూ కనిపిస్తూనే... వినిపిస్తూ ఉన్నాయి. అంటే.. సమాజంలో ఇంకా.. అమ్మాయిల పట్ల వివక్ష పోలేదు. ఆడపిల్ల పుడితే... అంతా ఖర్చే అన్న ధోరణి మారలేదు. చదువుల ఖర్చు... పెళ్లిళ్ల ఖర్చు... అంతా భారమే అనుకుంటున్నారు చాలా మంది. ఆడపిల్లను కనేందుకు ఇష్టపడటం లేదు. పుట్టినా.. ఎలాగోనా వదిలించుకుంటున్నారు చాలా మంది. పట్టణాల్లో కాకపోయినా... మారుమూల పల్లెల్లో ఆడిపిల్లలపై చిన్నచూపు కొనసాగుతూనే ఉంది. అలాంటి ఆడిపిల్లల సంరక్షణ కోసం... ఓ యువ జంట పెద్దమనస్సుతో ముందుకొచ్చింది. తమ గ్రామంలో పుట్టిన ప్రతి ఆడపిల్ల పేరుపై 2వేల రూపాయలు డిపాజిట్ చేయాలని నిర్ణయించుకుని. ఇచ్చేది చిన్న మొత్తమే అయినా... వారి ఆలోచన మాత్రం ఎంతో మంది ఆదర్శవంతమైనది. తన దగ్గర డబ్బులు ఉంటే... బ్యాంకుల్లో దాచుకోవడమో... ఆడంబరాలకు ఖర్చు చేస్తున్నారు. ఆస్తులు పెంచుకుంటారు. కానీ... ఈ దంపతులు మాత్రం సమాజం కోసం ఆలోచించారు. ఆడబిడ్డల భవిష్యత్ కోసం ముందడుగువేశారు. ఇంతకీ ఎవరా దంపతులు..? వారికి ఇలాంటి ఆలోచన ఎందుకు వచ్చింది..?నిజామాబాద్ జిల్లా తాడ్వాయి మండలం ఏండ్రియల్ గ్రామంలో రెడ్డిగారి తిరుపతిరెడ్డి - శ్రావణలక్ష్మి దంపతులు ఉంటున్నారు. వారి పదో వార్షికోత్సవం( సందర్భంగా.. సమాజం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. జనవరి ఒకటి2024 నుంచి తమ గ్రామంలో... పుట్టిన ప్రతి ఆడపిల్ల పేరు మీద... 2వేల రూపాయలు డిపాజిట్ చేయాలని నిర్ణయించుకున్నారు ఈ దంపతులు. పుట్టిన ఆడపిల్ల పేరుపై... సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరిచి.... 2 వేల రూపాయలు వేస్తున్నారు. తమ నిర్ణయం అందరికీ తెలిసేలా ప్రచారం కూడా చేస్తున్నారు. పాంప్లేట్లు వేయించారు. ఆడపిల్ల పుట్టినవారు తమను సంప్రదించాలని కోరుతున్నారు. తమ 10వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా... జనవరి ఒకటి, 2024 నుంచి... ఏండ్రియల్ గ్రామం లో పుట్టిన ప్రతి ఆడపిల్లకు తమ తరపున సుకన్య సమృద్ధి ఖాతా తెరిచి 2వేల రూపాయలు జమ చేస్తామని చెప్తున్నారు. ఆడపిల్ల ఉన్నత చదువులకు, వారి పెళ్లికి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా... పుట్టినప్పటి నుంచే తల్లిదండ్రులు పొదుపు చేయాలనే అవగాహన కల్పిస్తున్నామని అంటున్నారు ఆ దంపతులు. ఎందరికో ఆదర్శవంతంగా నిలుస్తున్నారు. ఈ దంపతుల్లా ఎంత మంది ఉంటారు. ఎంత మంది వీళ్లలా సమాజం కోసం ఆలోచిస్తారు.

# విపక్షాల అసత్య ప్రచారాలు నమ్మకండి



**యాదాద్రి:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రెస్ మీట్ నిర్వహించారు ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ భువనగిరి లోక్ సభ కాంగ్రెస్ కి కంచుకోట. సాధారణ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ కి మంచి మెజారిటీ వచ్చింది. వరుణుడు కూడా వర్షపు జల్లుతో ఆశీర్వదించాడు. గతంలో ఆగిపోయిన పథకాలు అన్నింటిని కొనసాగిస్తాం. రూ.7,624 కోట్లు రైతులకు ఇవ్వాలని భావించాం. రైతుల ఖాతాలో నగదు జమ చేద్దాం అనుకుంటే కొంతమంది ఫిర్యాదులు చేశారు. ఈసీ ఆదేశాలు వలన రైతుల ఖాతాలో నగదు జమ చేయలేకపోయామని అన్నారు.భాజపా, భారాస చెప్పే అసత్య ప్రచారాలను నమ్మకండి. భారాస, భాజపా లకి ఒకటి రెండు సీట్లు వస్తే నయమే. కాంగ్రెస్ కి 14 సీట్లు రాబోతున్నాయి. ఎక్కడైనా విద్యుత్ అంతరాయం కలిగిన వెంటనే మరమ్మతులు చేస్తున్నారు. విద్యుత్ కి అంతరాయం లేకుండా చూస్తున్నాంమని అన్నారు.

## కేసులు ఎదుర్కోంటాం క్రిశాంక్ ను పరామర్శించిన కేటీఆర్




**హైదరాబాద్:** బీఆర్ఎస్ సోషల్ మీడియా సభ్యుడు క్రిశాంక్ ను పరామర్శించేందుకు చంచల్ గూడ జైలుకు మాజీమంత్రి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వచ్చారు.కేటీఆర్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి చేతిలో అధికారం ఉందని బీఆర్ఎస్ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపడం మంచిది కాదని అన్నారు. అధికారం శాశ్వతం కాదని, తప్పకుండా మేము బదులు చెబుతామని, క్రిషాంక్ సోషల్ మీడియా లో పోస్టు చేసిన సర్క్యులర్ తప్పుడు అయితే నేను చంచల్ గూడా జైలు కు వెళ్ళడానికి తను సిద్ధం అని, ఒకవేళ సర్క్యులర్ నిజమని మేము రుజువు చేపిస్తే రేవంత్ రెడ్డి జైలుకు వెళ్తాడా అని కేటీఆర్ సవాల్ చేసారు. బీఆర్ఎస్ శ్రేణులకు కేసులు కొత్తేమి కాదని, దైర్యంగా ఎదుర్కోంటామని, బీఆర్ఎస్ ఉద్యమాల పార్టీ అని ఆయన అన్నారు.

## 1000 దాటేసిన సిక్సర్లు




హైదరాబాద్: ఐపీఎల్ 17వ సీజన్లో హైదరాబాద్ జట్టు అరుదైన ఘనతను సృష్టించుకుంది.లక్నో, హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో 1000 సిక్సర్ ల మార్క్ దాటింది. దీంతో ఈ సరికొత్త రికార్డుకు హైదరాబాద్ ఉప్పల్ మైదానం వేదికయింది.. వాస్తవానికి ఈ సీజన్లో ఆటగాళ్లు దూకుడుగా ఆడుతున్నారు.. ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నారు. ఫోర్లు, సిక్స్ లు ఎడా పెడా కొడుతూ బౌలర్లకు నిద్రలేని రాత్రులు పరిచయం చేస్తున్నారు..హైదరాబాద్ జట్టయితే ఈ ఐపీఎల్ లో ఏకంగా ముంబై పై 277, బెంగళూరు పై 287 రన్స్ చేసి సరికొత్త రికార్డు సృష్టించింది. ఐపీఎల్ చరిత్రలో ఏ ప్రకారం చూసుకున్నా 17వ సీజన్ అన్ని రికార్డులను బద్దలు కొడుతోంది.ఈ సీజన్లో 13,079 బంతుల్లో బ్యాటర్లు 1000 సిక్సర్లు కొట్టారు. అంతకుముందు 2022లో 1000 సిక్సర్లు కొట్టేందుకు బ్యాటర్లు 16,269 బంతులను వినియోగించారు. 2023లో 15,390 బంతులను ఎదుర్కొని 1000 సిక్సర్లు బాదారు. ఇప్పటివరకు 57 మ్యాచులు పూర్తయ్యాయి. ఇంకా కొన్ని మ్యాచ్లు మిగిలి ఉన్న నేపథ్యంలో బ్యాటర్లు మరెన్నో సిక్సర్లు కొట్టే అవకాశం ఉంది. ఈ సిక్సర్ల జాబితాలో హైదరాబాద్ జట్టు అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ జట్టు ఆటగాళ్లు దూకుడుగా బ్యాటింగ్ చేస్తుండడంతో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఫోర్లకంటే సిక్సర్లే ఎక్కువగా కొడుతుండడంతో హైదరాబాద్ జట్టు ఆటగాళ్లు ఈసారి ప్రత్యేకంగా నిలుస్తున్నారు.హైదరాబాద్ జట్టు ఈసారి 138 సిక్స్ లు కొట్టింది. ఢిల్లీ జట్టు 120 సిక్స్ లు బాదింది. కోల్‌కతా 116, ముంబై ఇండియన్స్ 116, బెంగళూరు 114, పంజాబ్ 95, రాజస్థాన్ 94, చెన్నై 82, లక్నో 77, గుజరాత్ 54 సిక్స్ లు కొట్టి తమ సత్తా చాటారు. అయితే ఈసారి ఆటగాళ్లు దూకుడుగా ఆడటం వల్లే ఈ స్థాయిలో సిక్స్ లు నమోదవుతున్నాయని మాజీ క్రికెటర్లు చెబుతున్నారు. అయితే ఈసారి ఇంకా కొన్ని మ్యాచ్లు మిగిలి ఉన్న నేపథ్యంలో.. మరిన్ని సిక్స్ లు నమోదవుతాయని తెలుస్తోంది. బ్యాటర్లు అంతకంతకు దూకుడుగా ఆడుతున్న నేపథ్యంలో సరికొత్త రికార్డులు నెలకొల్పే అవకాశం ఉంది.

# ఏపీలో పవర్ ప్లే



**విజయవాడ, మే 9:** అవును.. మొన్న అమిత్ షా ఒకసారి వచ్చి వెళ్లిన వెంటనే ఏపీ డీజీపీ బదిలీ అయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ మూడు రోజుల వ్యవధిలో రెండు సార్లు ఆంధ్రప్రదేశ్ లో పర్యటించారు. వాయిస్ పెంచారు. జగన్ అవినీతిపై గళమెత్తారు. ఎన్నికలకు ఇంకా ఆరు రోజులు సమయం ఉన్న తరుణంలో ప్రధాని నరేంద్ర మోదీతో పాటు ఇటు టీడీపీ అధినేత చంద్రబాబు, అటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ తో పాటు అందరూ కమ్మేశారు. జగన్ ఒక్కడే అయ్యాడు. టీ 20లో పవర్ ప్లే లో పరుగులు రాకుండా చేసినట్లే.. బలమైన నేతలందరూ ఒక్కటై జగన్ టీంను కట్టడి చేస్తున్నారనే అనుకోవాలి. ఎందుకంటే ఏపీ ఎన్నికలు టీ 20 క్రికెట్ మ్యాచ్ ను తలపిస్తుందనే చెప్పాలి.అందరూ కలసి వస్తున్నారని గత కొంత కాలంగా జగన్ చెబుతూ వస్తున్నారు. అయితే మొన్న ఐదో తేదీ వరకూ పెద్దగా జగన్ కు ఇబ్బంది జరగలేదు. ఎందుకంటే తొలుత కూటమి సభకు ప్రధాని మోదీ హాజరయినప్పుడు జగన్ ప్రభుత్వంపై విమర్శలు చేయలేదు. జగన్ పేరు కానీ, కనీసం వైసీపీ పేరు కూడా ఆయన ప్రస్తావించకపోవడంతో పాటు డీజీపీ, చీఫ్ సెక్రటరీలను కొనసాగిస్తుండటంతో కొంత అనుమానాలు తలెత్తాయి. జగన్ తో లోపాయి కారీ ఒప్పందాన్ని బీజేపీ కుదుర్చుకుందన్న కామెంట్లు కూడా వినిపించాయి. కానీ ఈ నెల 5వ తేదీ నుంచి అమిత్ షా రాకతో మాత్రం మొత్తం సీన్ మారిపోయింది. ఆ తర్వాత ఆరో తేదీ ప్రధాని మోదీ పర్యటించారు. ఈరోజు ప్రధాని పర్యటనలో కూడా నేరుగా జగన్ పై విమర్శలు చేశారు. అంటే జగన్ ఒక్కడే ఇటు వైపు.. మిగిలిన హేమాహేమీలందరూ మరొక వైపు. ఎన్నికల ముందు పది రోజుల వరకూ జగన్ పట్ల కొంత సానుకూలతతో వ్యవహరించినట్లే కమలం పార్టీ కనిపించింది. కానీ తర్వాత మాత్రం సీన్ మారింది. ఎంతగా అంటే జగన్ టీం ఒక్క పరుగు చేయకుండా, బంతి బౌండరీ లైన్ దాటనివ్వకుండా చుట్టూ ఫీల్డర్లను మొహరించినట్లే కనపడుతుంది. ఒక్క పరుగుల చేసినా అది జగన్ విజయానికి కారణమవుతుందేమోనన్న భయంతో పరుగులే లేకుండా చేయాలన్న కసితో మాత్రం విపక్షాలన్నీ ఒక్కటిగా మారాయి. కేవలం కూటమి మాత్రమే కాదు.. జగన్ టీం ను నిలువరించడానికి వైఎస్ షర్మిలతో పాటు వైఎస్ సునీత రూపంలో కూడా ఇంపాక్ట్ ప్లేయర్స్ ఉనట్లే కనపడుతంది. దీంతో రాష్ట్రంలో అనేక చోట్ల ఉద్రిక్తతలు తలెత్తుతున్నాయి. వారిద్దరూ వచ్చిన తర్వాతే... అమిత్ షా, మోదీ వచ్చి రాష్ట్రానికి వచ్చి వెళ్లిన తర్వాత అనేక నియోజకవర్గాల్లో టీడీపీ, వైసీపీ క్యాడర్ కూడా బాహాబాహీలకు దిగుతుంది. టీడీపీ క్యాడర్ లో తెలియని ధైర్యం వచ్చిందనే చెప్పాలి. మొన్నటి వరకూ కేసులకు భయపడి బయటకు రాని వాళ్లు నేడు అమితుమీ తేల్చుకునేందుకు సిద్ధమయినట్లే కనిపిస్తుంది. చివరకు పోస్టల్ బ్యాలట్ పోలింగ్ కేంద్రాల వద్ద కూడా యుద్ధ వాతావరణమే నెలకొంది. ఒకరినొకరు ఢీ అంటే ఢీ అని తలపడుతున్నారు. బీజేపీ అగ్ర నేతల పర్యటన తర్వాతనే ఆంధ్రప్రదేశ్ లో ఇలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయని చెప్పవచ్చు. ఎందుకంటే తమ వెనక కేంద్ర ప్రభుత్వం ఉందన్న ధీమా వారిలో ధైర్యాన్ని తెచ్చి ఉండవచ్చు. అదే ఇప్పుడు ఏపీలో శాంతిభద్రతలకు సమస్యగా మారిందని చెప్పాలి. ఈరోజే ఇలా ఉంటే మరి పోలింగ్ రోజున ఏ తీరును ఉంటుందన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతుంది.

# కలివిడిగా.. వైఎస్ బంధువులు




**కడప, మే 9:** కడప జిల్లాలో వైఎస్ షర్మిలకు విచిత్రమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. వైఎస్ కుటుంబీకులు మాత్రమే కాదు వైఎస్ రాజశేఖర్ రెడ్డితో సన్నిహిత సంబంధాలనున్న వారు ఎవరూ ఆమెకు సహకరించడం లేదని తెలుస్తోంది. షర్మిల కడప పార్లమెంటు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీకి దిగుతున్నారు. అయితే ఆమె ఇటీవల కడపలో పర్యటించినప్పుడు కూడా వైఎస్ సన్నిహితులు, బంధువులు కూడా ఆమె దగ్గరకు కూడా రాలేదని చెబుతున్నారు. అందుకు ప్రధాన కారణం వైఎస్ షర్మిల జగన్ ను వ్యతిరేకించడమేనని అంటున్నారు. పైగా కడప పార్లమెంటు నుంచి పోటీ చేయడం కూడా ఆమె పెద్ద సాహసం చేశారనే చెప్పాలి. కడపలో ఉన్న వైఎస్ కుటుంబానికి దగ్గరగా ఉన్న వారు కూడా ఆమె దగ్గరకు రావడానికి కూడా ఇష్టపడటం లేదని తెలిసింది. . అది చూసిన వైఎస్ షర్మిల ఒకింత షాక్ కు గురయినట్లు తెలిసింది. గతంలో తాను కడప వచ్చినప్పుడు తన వెంట వచ్చి తనతో పాటు ఉండే కొందరు కుటుంబ సభ్యులు కూడా ఈసారి మాత్రం పూర్తిగా పక్కన పెట్టేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరును సీ?బీఐ ఛార్జిషీటులో నమోదు చేసిన కాంగ్రెస్ లో చేరడం వైఎస్ షర్మిల చేసిన తప్పిదమని వారు నేరుగానే చెబుతున్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల్లో ఎక్కువ మంది ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ పై నేరుగా విమర్శలు చేయడాన్ని కూడా వారు అంగీకరించడం లేదు. జగన్ వైఎస్ కుటుంబీకులతో పాటు ఆయనకు సన్నిహితంగా ఉన్న వారిని ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా ఆప్యాయంగా పలకరిస్తూ ఉండటం ఇందుకు మరొక కారణంగా చెబుతున్నారు.వైఎస్ షర్మిలకు దూరంగా ఉండటానికి మరో ప్రధాన కారణం.. జగన్ ఇక్కడ లేకున్నా ఆయన తన తరుపున నియమించిన వారు తమ బాగోగులు చూసుకుంటారంటున్నారు. కానీ షర్మిల గెలిచినా, ఓడినా కూడా తమకు అందుబాటులో ఉండరని, ఆమె హైదరాబాద్ కు వెళతారని, ఇక్కడ తమకు అండగా ఉండే వారెవరని వారు నేరుగానే ప్రశ్నిస్తున్నారని తెలిసింది. అందుకే షర్మిల వచ్చిన వైఎస్ కుమార్తెగా ఆమెను దగ్గరకు తీయాల్సిన సమయంలో ముఖం చాటేస్తున్నారని కొందరు చెబుతున్నారు. షర్మిలతో తాము మాట్లాడినట్లు జగన్ కు తెలిస్తే తాము ఎక్కడ దూరమవుతామోనన్న ఆందోళన వారిలో స్పష్టంగా కనివిస్తుందని షర్మిల వెంట తిరిగే వారే అభిప్రాయపడుతున్నారు. వైఎస్ షర్మిల నామినేషన్ వేసిన సందర్భంలో కూడా వివేకానందరెడ్డి కుమార్తె వైఎస్ సునీత మినహాయించి దగ్గర బంధువులు ఎవరూ ఆమె వెంట లేకోవడాన్ని కొందరు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. కొందరిని నామినేషన్ పత్రాలపై ప్రతిపాదన సంతకాలు చేయాలన్నా దగ్గర బంధువులు కూడా ససేమిరా అన్నారంటే ఎంత దూరం పెడుతున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చంటున్నారు. దీంతో పాటు తాజాగా తనకు ప్రధాన ఏజెంట్ గా ఉండాలని కడపలోని తమ కుటుంబంలోని ఒక ముఖ్య వ్యక్తిని వైఎస్ షర్మిల సంప్రదించినా సున్నితంగా తిరస్కరించారని తెలిసింది. కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు మాత్రమే వైఎస్ షర్మిల వెంట ఉంటున్నారు. దీంతోనే కడపలో వైఎస్ షర్మిల ఎంత దూరమయ్యారో ఇంతకంటే వేరే చెప్పాల్సిన పనిలేదు. అందుకే విజయమ్మ కూడా ఇక్కడ ఉండలేక అమెరికా వెళ్లారంటున్నారు.

# ఉద్యోగుల ఎఫెక్ట్... ఎవరిపైనా



**విజయవాడ, మే 9 :** ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులు పెన్షనర్ల నాడి రాజకీయ పార్టీల కు అందడం లేదు. వేతన జీవులు, మధ్య తరగతి ఉద్యోగస్తుల అండదండలు ఏ పార్టీకి దక్కుతాయో తెలియని పరిస్థితి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజక వర్గాల్లో ప్రభుత్వ ఉద్యోగులు,ఉపాధ్యాయులు గణనీయంగా ఉంటారు. ఈ నేపథ్యంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీని మిడిల్ క్లాస్ ఓటర్లు, ఉద్యోగ వర్గాలు గెలిపిస్తాయనేది ఆసక్తికరంగా మారింది.ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 14.76లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఉన్నారు. వీరిలో 4,20,000 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో మరో లక్షా 28వేల మంది ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వంలో విలీనమైన ఏపీఎస్ ఆర్టీసీలో 53వేల మంది ఉద్యోగులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నేరుగా జీతాలు అందుకున్న వారు దాదాపు ఆరులక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. ఏపీలో సర్వీస్ పెన్షనర్లు 3.58లక్షల మంది ఉన్నారు. సర్వీస్ పెన్షన్లపై ఆధారపడి ఫ్యామిలీ పెన్షన్ అందుకునే వారు మరో లక్ష మంది ఉన్నారు. ఇలా ప్రభుత్వ పెన్షనర్లు 4.58లక్షల మంది ఉన్నారు.ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అన్ని శాఖల్లో, జిల్లాల్లో కలిపి లక్షా 20వేల మంది వరకు ఉన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు 80వేల మంది, అంగన్ వాడీ వర్కర్లు, సహాయకులు మరో లక్షమంది ఉన్నారు. హోమ్ గార్డులు 15వేల మంది ఉన్నారు. మొత్తం అన్ని శాఖల్లో కలిపి 14,76వేల మంది ప్రభుత్వం నుంచి జీతాలు, పెన్షన్లు అందుకుంటున్నారుఏపీలో దాదాపు ఏడాది కాలంగా ఉద్యోగ సంఘాలన్నీ సైలెంట్ అయిపోయాయి. రోడ్ల మీదకు ఎక్కి పోరాటాలు చేయడం లేదు. సీపీఎస్ ధర్నాలు, పిఆర్సీ ఆందోళనలు చాలా నెలల క్రితమే ఆగిపోయాయి. ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చదనే క్లారిటీ వచ్చిన తర్వాత ఉద్యోగ సంఘాలన్నీ సైలెంట్ అయిపోయాయి. గత కొన్నేళ్లుగా ఉద్యోగుల పెన్షన్లు, జీతాలు ప్రతి నెల మొదటి వారం తర్వాతే జమ అవుతున్నాయి. ఈ పరిస్థితిపై ఉద్యోగుల్లో పెద్ద ఎత్తున అసంతృప్తి గూడు కట్టుకున్నా సంక్షేమ పథకాల అమలు, నగదు బదిలీకే ప్రాధాన్యం ఇచ్చారు. ఐదేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతల్లో నవరత్నాల అమలు, నగదు బదిలీ పథకాలకే తొలిప్రాధాన్యం దక్కింది. దీంతో ఉద్యోగుల వేతనాలు, పెన్షన్ల చెల్లింపు, డిఏ బకాయిలు, సరెండర్ లీవులు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు, రిటైర్మెంట్ ప్రయోజనాలు వంటి వాటికి పెద్దగా ప్రాధాన్యత దక్కలేదు. ఉద్యోగుల రిటైర్మెంట్ ప్రయోజనాలను చెల్లించకలేక పదవీ విరమణ వయసును 62ఏళ్లకు పెంచారు. వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నా పదవీ విరమణ వయసు వచ్చిన తర్వాతే బెనిఫిట్స్ చెల్లిస్తామని మెలిక పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ ద్వారా వైద్యం విషయంలో కూడా పలు సమస్యలు ఉన్నాయి.రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు మరో మూడు లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఓటర్లుగా ఉన్నారు. బ్యాంకులు, రైల్వేలు, ప్రభుత్వ రంగ సంస్థలు, పెట్రోలియం సంస్థలు, నేవీ, ఆర్మీ ఉద్యోగులు కూ?డా గణనీయంగానే ఉన్నారు. సగటున ఒక్కో ఇంటికి నలుగురు ఓటర్లను లెక్కేసుకున్నా దాదాపు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వారి కుటుంబాల్లో కనీసం 60-70లక్షల ఓట్లు ఉంటాయి.త్వరలో జరిగే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఈ ఓట్లన్ని ఎటువైపు మొగ్గు చూపిస్తాయనేది కీలకంగా మారింది.

# ఈజీ మనీ కోసం 5 హత్యలు



**కాకినాడ, మే 9 :** అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండలం జంపెన గ్రామానికి చెందిన పి.ఉపేంద్ర.. జల్సాల కోసం ఈజీ మనీకి అలవాటు పడ్డాడు. అందులో భాగంగా నేరాలను ప్రారంభించాడు. చోరీలు, మోసాలు అయితే ఏమో? డబ్బుల కోసం ఏకంగా హత్యలకు పాల్పడుతున్నాడు. ఒకటి కాదు రెండు కాదు ఇప్పటివరకు అతని ఖాతాలో ఐదు హత్యలు చేరాయి.అచ్చుతాపురంలోని ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు ఉపేంద్ర. తన టార్గెట్ కోసం వెతకడం ప్రారంభించాడు. ఈ క్రమంలో అదే కంపెనీలో పనిచేస్తున్న మాకవరపాలెం మండలం జడ్. గంగవరంనకు చెందిన రుత్తల శివ శంకర్‌తో ఉపేంద్రకు పరిచయం ఏర్పడింది. అతన్ని మాయమాటలతో నమ్మించి ట్రాప్ చేశాడు. మాయమాటలు చెప్పి చాటుమాటు దందాకు తెరలేపాడు. రెండు లక్షల రూపాయలు తీసుకొస్తే.. లిక్విడ్ గంజాయి కొనుగోలు చేద్దామని నమ్మించాడు. దానిని అమ్మితే 4 నుంచి 5 రెట్లు లాభం సంపాదించవచ్చని నమ్మబలికాడు. దీంతో శివ శంకర్ ఎఫ్రిల్ నెల 29వ తేదీన రెండు లక్షలు పట్టుకుని ఊరి శివారుకు వచ్చాడు. అదను చూసిన ఉపేంద్ర.. శివ శంకర్ తలపై కర్రతో మోదీ హతమార్చి పారిపోయాడని పోలీసులు తెలిపారు.శివ శంకర హత్య కేసులో పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. నిందితుడు కోసం వేట మొదలుపెట్టారు. ఈ క్రమంలో జనవరి 31వ తేదీన లచ్చన్నపాలేనికి చెందిన వాలంటీర్ నడింపల్లి హరనాథ్ హత్య కేసు మిస్టరీ వీడింది. హరినాథ్‌ను కూడా ఉపేంద్ర ట్రాప్ చేసి హత్య చేసినట్టు గుర్తించారు పోలీసులు. తన ప్లాన్ లో భాగంగానే ఉపేంద్ర.. హరినాధను నమ్మించాడు. అప్పటికే తన వద్ద ఉన్న పింఛన్ల సొమ్ముతో ఊరి బయటకు రప్పించి ఉపేంద్ర హత్య చేసినట్టు సిఐ హరి చెప్పారు.అయితే.. హత్య చేశాక ఆధారాలు దొరక్కుండా ఉపేంద్ర జాగ్రత్త పడుతున్నాడు. తనపై పోలీసులకు అనుమానం రాకుండా ఆధారాలు తారుమారు చేస్తున్నాడు. వాలంటీర్‌ను హత్య చేసిన ప్రాంతంలో గాజులు, కండోమ్ ప్యాకెట్లు వేసి, పోలీసులనూ డైవర్ట్ చేసే ప్రయత్నం చేశాడని పోలీసులు అంటున్నారు.కేవలం ఈ రెండు హత్యలే కాదు.. ఇదే తరహాలో 2022 అక్టోబర్ 12న మునగపాకకు చెందిన మహాలక్ష్మి నాయుడు అనే యువకుడిని మరో హత్య చేసి లక్ష రూపాయలకు పైగా నగదు తీసుకుని పరారయ్యాడు. ఒక హత్య కోసం కూపీ లాగితే మూడు హత్యలు బయటపడ్డాయి. అయితే ఉపేంద్ర అంతకుముందు కూడా వి. మడుగులలో రెండు హత్యలు చేసి జైలుకెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చాడని, మళ్లీ మూడు హత్యలు చేయడం ప్రారంభించాడని సిఐ హరి వెల్లడించారు.ఎట్టకేలకు సీరియల్ కిల్లర్ ఉపేంద్ర అరెస్ట్ అవ్వడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇటువంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు పోలీసులు. నిందితుడిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# పొన్నూరు పాత ట్రెండ్ ఫాలో అవుతుందా



**గుంటూరు, మే 9 :** ఆ నియోజకవర్గంలో ఆయన ఆరు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి అయిదు సార్లు వరుస విజయాలు సాధించారు. అక్కడ ఆ పార్టీకి కర్త, కర్మ, క్రియ అన్నీ ఆయనే.. మూడు దశాబ్దాలుగా అక్కడ సొంత పార్టీలో ఎలాంటి వ్యతిరేకతా లేకుండాఆయన మాటే చెల్లుబాటవుతూ వస్తుంది. చిత్రమేంటంటే ఆయనపై పోటీ చేసే అభ్యర్థులు మాత్రం ప్రతిఎన్నికలకీ మారిపోతుంటారు. ఇన్నేళ్లలో ఆయన్ని ఒక్కసారి ఓడించగలిగిన సిట్టింగ్ ఎమ్మెల్యేని కూడా మార్చేసింది ప్రత్యర్థి పార్టీ.. ఇంతకీ ఎవరా లీడర్?పొన్నూరు నియోజకవర్గం.. గుంటూరు జిల్లాలో పొన్నూరు నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. బాపట్ల, తెనాలి, గుంటూరు నియోజకవర్గాల మధ్యలో ఉడే పొన్నూరు నియోజకవర్గంలో రాజకీయ చైతన్యం ఎక్కువ.. ఈ నియోజకవర్గంలో 1994 నుంచి టీడీపీ అభ్యర్థిగా సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రే పోటీ చేస్తున్నారు. ప్రస్తుతం ఏడో సారి పోటీలో ఉన్న నరేంద్ర గత ఎన్నికల్లో ఒక్కసారే పరాజయం పాలయ్యారు. 1994 నుంచి వరుసగా అయిదు సార్లు గెలుస్తూ వచ్చిన ఆయన డబుల్ హ్యాట్రిక్ విజయానికి 2019లో బ్రేక్ పడింది.నాలుగు సార్లు కాంగ్రెస్‌పై, ఒకసారి వైసీపీపై విజయం సాధించిన ధూళిపాళ్ల నరేంద్రపై ప్రతిసారి ప్రత్యర్థి మారుతూనే ఉన్నారు. ప్రత్యర్థి పార్టీలు నరేంద్ర స్థాయి బలమైన నేత దొరక్క ప్రతి ఎన్నికల్లో కొత్త ముఖంతో ప్రయోగం చేస్తున్నాయి. పొన్నూరులో అంత బలమైన పునాదులు ఏర్పరుచుకుంది ధూళిపాళ్ల కుటుంబం. టీడీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలోకి వచ్చిన నరేంద్ర తండ్రి ధూళిపాళ్ల వీరయ్యచౌదరి 1983, 85 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించారు. 1989లో పరాజయం పాలైన ఆయన తర్వాత రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు.1994 ఎన్నికల నాటికి నరేంద్ర తండ్రి రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన టి. వెంకటరామయ్యపై దాదాపు 20 వేల మెజార్టీతో గెలుపొందారు. 1999 నాటికి ప్రత్యర్థి మారిపోయారు .. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన చిట్టినేని ప్రతాప్‌బాబుని ధూళిపాళ్ల 15 వేల పైచిలుకు ఓట్ల తేడాతో ఓడించారు. 2004లో కాంగ్రెస్ నుంచి మన్నవ రాజకిషోర్, 2009లో మారుపూడి లీలాధరరావు, 2014లో వైసీపీ నుంచి పోటీ చేసిన రావి వెంకట రమణలు నరేంద్ర చేతిలో పరాజయం మూటగట్టుకున్నారు

# జగన్ వాయిస్ మారుతోందా

**విశాఖపట్టణం, మే 9:** వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. వైసీపీ అధినేత.. ప్రస్తుతం ఏపీ సీఎం.. నిజానికి ఆయన క్యాంపెయిన్ స్టైల్‌ని అబ్జర్వ్ చూస్తే.. ఓ దూకుడు కనిపిస్తుంది. విపక్షాలపై విరుచుకుపడుతూ.. ఎవరేమన్నా డోంట్ కేర్ అన్నట్టుగా ఉంటుంది ఆయన మాట. బట్ ఆయన ఇప్పుడు కొత్త రాగం ఎత్తుకున్నారు. ఆయన స్టైల్‌కు భిన్నంగా కొత్త వ్యాఖ్యలు చేస్తున్నారు. ఎందుకిలా అనాల్సి వస్తుంది? దీనికి ఎక్స్‌ప్లనేషన్ కంటే.. మీ చేవులారా మీరే వినండి.. నన్ను పదవిలో ఉండకుండా చేయాలని చూస్తున్నారు. కావాలనే కుట్రలు చేసి పథకాలు ఆపేస్తున్నారు.వీటన్నికంటే హైలేట్ డైలాగ్ ఏంటంటే.. ఎన్నికలు సజావుగా జరుగుతాయని నమ్మకం లేదు. సీఎం జగన్ నోటి నుంచి ఈ మాటను ఎవరూ ఎక్స్‌పెక్ట్ చేసి ఉండరు. ఎందుకంటే వైనాట్ 175 అంటూ క్లీన్ స్వీప్ చేయాలనుకున్నారు సీఎం జగన్.. అలాంటి ఆయన నోటి నుంచి ఎన్నికల విధానంపై ఎందుకు డౌట్స్ వస్తున్నాయి? ఈ మధ్య కాలంలో ఏమైనా మారిందా? లేదా అంచనాలు ఏమైనా తలకిందులయ్యాయా? లేదంటే కూటమిలో భాగమైన బీజేపీ అంటే కేంద్ర ప్రభుత్వం.. టీడీపీకి ఫేవర్‌గా పనిచేస్తుందని ఫీలవుతున్నారా? అందుకే ఇలాంటి డైలాగ్‌ను వాడారా?వైసీపీ ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీ.. జగన్.. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి.. ఫలితాలు ఎలా వచ్చినా జూన్ 4 వరకు ఆయనే సీఎం.. అలాంటి వ్యక్తి నోటి నుంచి ఎన్నికల విధానంపై డౌట్స్ రావడం అస్సలు నార్మల్ కాదు. ఇది సింపతి కోసం జగన్ చేస్తున్న పొలిటికల్ స్టంటా? లేక మరేదైనా కారణమా? అయితే జగన్ ఇలా మాట్లాడటానికి కొన్ని రీజన్స్ ఉన్నాయి. అవేంటో చూద్దాం.. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎలక్షన్ కోడ్ అమల్లో ఉంది. పేరుకు నేతలు పదవుల్లో ఉన్నా.. అధికారం మొత్తం ఎన్నికల కమిషన్‌దే.. అలాంటి ఈసీకి ఎలాంటి నిర్ణయాలైనా తీసుకునేందుకు అధికారం ఉంది. ఇప్పుడా అధికారాన్ని ఫుల్ ఫ్లెడ్జ్‌గా ఉపయోగిస్తుంది ఏపీలో.. లబ్ధిదారులకు సంక్షేమ పథకాల నిధులను విడుదల చేయవద్దంది. దీంతో చేయూత, విద్యాదీవేన, రైతు భరోసా పథకాలకు నిధులు ఆగిపోయాయి.నిజానికి ఎన్నికలకు ముందే సీఎం జగన్ వీటికి సంబంధించి బటన్ నొక్కేశారు. కానీ




ఈసీ ఇప్పుడు బ్రేక్ వేసింది. నెక్స్ట్.. ఏపీ డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డిని బదిలీ చేసింది. ఎలాంటి ఎన్నికల విధులు అప్పగించకూడదని ఆదేశించింది. అంతకుముందు అనేక మంది ఎస్పీలు, డీఎస్పీలు, కలెక్టర్లను బదిలీ చేసింది ఈసీ.. అంతేందుకు అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డిపై కూడా బదిలీ వేటు పడింది. అధికార పార్టీ ప్రచారంలో పాల్గొన్న వాలంటీర్లపై వేటు వేసింది. అధికార దుర్వినియోగం కాకుండా ఎక్కడికక్కడ కట్టడి చేస్తోంది. మొత్తానికి వైసీపీకి అనుకూలంగా ఉన్నారనుకున్న అందరిపై వేటు పడింది..ఈ బదిలీలు.. ఈసీ తీసుకుంటున్న నిర్ణయాలను చూస్తే.. జగన్ నోటి నుంచి ఈ వ్యాఖ్యలు ఎందుకు వచ్చాయన్నది అర్థమైంది అనే అనుకుంటున్నా.. అంతేకాదు జగన్ మాట తీరు మారడంతో ఇక్కడ కొన్ని అనుమానాలు కూడా వస్తున్నాయి. వైసీపీకి అనుకూలంగా ఉన్న వారందరిపై వరుసగా వేటు పడుతూ వస్తుంది. దీంతో ఆ పార్టీ నేతలకు భయం పట్టుకుందా? ఏదైనా జరగరానిది జరుగుతుందని భయపడుతున్నారా? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.అయితే ఈ సిట్యూవేషన్‌ను కూడా తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు జగన్.. అధికారులపై టీడీపీ నేతలు వరుసగా ఫిర్యాదు చేస్తున్నారు. అందుకే ఈసీ చర్యలు తీసుకుంటుంది. కేంద్రంలో ఉన్న బీజేపీ సర్కార్ టీడీపీకి ఫుల్ సపోర్ట్ చేస్తుంది. ఆన్ గోయింగ్ పథకాలను ఆపేస్తుంది టీడీపీ పార్టీనే. లబ్ధిదారులకు డబ్బులు అందకుండా టీడీపీ చేస్తోంది. అంటూ ఆరోపణలు చేస్తున్నారు

# అప్రయత్నంగా చిక్ సమ్మర్ చీర





తమన్నా భాటియా ఇటీవల విడుదలైన అరణ్మనై 4 విజయంలో బిజీగా ఉన్నారు. ఇప్పుడు, ఈ చిత్రంలో సెల్వి పాత్రను పోషించిన నటి, తెర వెనుక చిత్రాలను సెట్ నుండి వదిలివేసింది. సరే, తమన్నా సెల్విగా ఎంత అప్రయత్నంగా చిక్‌గా కనిపిస్తుందో మనం గమనించకుండా ఉండలేము. తన ఆన్-స్క్రీన్ ఎత్నిక్ స్టైల్‌తో అందరినీ ఆకట్టుకుంది, తమన్నా బ్రౌన్ ప్రింటెడ్ చీరలో తనను తాను కట్టుకుంది. డ్రేప్ మొత్తం సమిష్టిపై నల్లని చారలతో అలంకరించబడింది. ఆమె V-నెక్‌లైన్‌ని కలిగి ఉన్న నల్లని బ్లౌజ్‌తో మరియు పొట్టి స్లీవ్‌లతో మొత్తం ఎరుపు మరియు తెలుపు పూల ముద్రణతో జత చేసింది. సెల్వి సౌందర్యంలో ఎర్రబడిన బుగ్గలు మరియు నగ్న గులాబీ రంగులో నిగనిగలాడే పెదవులు ఉన్నాయి. ఆమె ఎరుపు బిందీ మరియు సిందూర్‌తో అన్నింటినీ జత చేసింది. యాక్సెసరీస్ విభాగం నుండి, తమన్నా తన ఝుంకాలు మరియు బ్యాంగిల్స్‌కు సరిపోయే స్లింకీ గోల్డ్ చైన్‌ని ఎంచుకుంది. ఆమె తన ఉంగరాల వస్త్రాలను వదులుతూ అన్నింటినీ మూసివేసింది. ఇంతకుముందు, తమన్నా భాటియా మరొక BTS చిత్రాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. నటి సెల్వి యొక్క అదే రూపాన్ని కలిగి ఉండగా, ఆమె టాన్-హ్యూడ్ డ్రేప్ తక్షణమే మన దృష్టిని ఆకర్షించింది. అందమైన చీర మైళ్ళ దూరం నుండి వేసవి శైలిని అరిచింది. టాన్ కలర్ చీర మందపాటి ఆకాశ-నీలం అంచుని కలిగి ఉంది. తమన్నా దానికి మ్యాచింగ్ హ్యూడ్ బ్లౌజ్‌తో పొట్టి చేతులతో జత చేసింది. తెరపైనా లేదా రెడ్ కార్పెట్‌పైనా, తమన్నా భాటియా యొక్క చీర గేమ్ ఎల్లప్పుడూ అగ్రస్థానంలో ఉంటుంది. దీనికి ముందు, నటి ఫ్యాషన్ డిజైనర్ తరుణ్ తహిలియాని షెల్ఫ్‌ల నుండి అద్భుతమైన మెటాలిక్ చీరలో అబ్బురపరిచింది. గ్రేస్ యొక్క ఆరు గజాల బంగారు సీక్విన్డ్ బార్డర్‌లను కలిగి ఉంది. డ్రామాటిక్ పఫ్ స్లీవ్‌లు మరియు ఉంగరాల నెక్‌లైన్‌తో వచ్చిన స్టేట్‌మెంట్ బ్లౌజ్‌తో తమన్నా జతకట్టింది. ఆమె లుక్‌ను చోకర్ సెట్‌తో జత చేసింది. డ్రెప్ యొక్క సరిహద్దులకు సరిపోయే బంగారు బెల్ట్ నడుము వద్ద పట్టుకుంది. తమన్నా భాటియా చీరలను చంపకుండా ఎవరూ ఆపలేరు.

# రెబల్ స్టార్ ఫ్యాన్స్‌కి క్రేజీ అప్‌డేట్.. 'కన్నప్ప' షూటింగ్‌లో జాయిన్ అయిన ప్రభాస్




టాలీవుడ్ హీరో మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'కన్నప్ప'. మోహన్ బాబు నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అత్యంత భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇప్పటికే ఈ చిత్రంలో నటించే అగ్ర నటులు తమ పాత్రకు సంబంధించిన షూటింగ్‌ను కంప్లీట్ చేసుకుంటున్న విషయం తెలిసిందే. ఇదిలావుంటే తాజాగా కన్నప్ప సెట్స్‌లోకి పాన్ ఇండియా స్టార్ హీరో ప్రభాస్ ఎంట్రీ ఇచ్చినట్లు చిత్రబృందం వెల్లడించింది. ఈ సందర్భంగా ఒక పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. ఇక ఈ పోస్టర్‌లో ప్రభాస్ పరమశివుడిగా కనిపిస్తుండగా.. పోస్టర్‌తోనే గూస్ బంప్స్ తెప్పిస్తున్నారు మేకర్స్. మరోవైపు ఈ సినిమాలో బాలీవుడ్ ఖిలాడీ, నటుడు అక్షయ్ కుమార్ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంతోనే టాలీవుడ్‌లో ఎంట్రీ ఇవ్వబోతున్నాడు అక్షయ్ కుమార్. తాజాగా అతడి పాత్రకు సంబంధించిన చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న కన్నప్పలో మోహన్‌బాబు, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, మోహన్ లాల్, నయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్ ఇతర నటీనటులు కీ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సమకూరుస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే సమకూరుస్తున్నారు.

## ధనుష్ 'రాయన్' ఫస్ట్ సింగిల్ వచ్చేసింది




తమిళ నటుడు ధనుష్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం రాయన్. సందీప్ కిషన్, మలయాళం నటుడు కాళిదాస్ జయరాం ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా.. మటన్ కొట్టు రాయన్‌గా ధనుష్ లుక్‌తో పాటు సందీప్ కిషన్, కాళిదాస్ జయరాం పోస్టర్‌లు వైరల్ అయ్యాయి. ఇక ఈ సినిమాను జూన్ నెలలో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. అయితే విడుదలకు ఇంకా నెల రోజులు ఉండడంతో ఇప్పటినుంచే ప్రమోషన్స్ షూరు చేసింది రాయన్ టీమ్. ఈ సినిమా నుంచి తాజాగా ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసింది.

ఈ మూవీ నుంచి అడంగాత అసురన్ అనే ఫస్ట్ సింగిల్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటను ఎ.ఆర్. రెహమాన్, ధనుష్ కలిసి పాడగా.. ధనుష్ స్వయంగా లిరిక్స్ అందించాడు. రెహమాన్ సంగీతం అందించాడు. ఈ సినిమా తమిళం, తెలుగు, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రంలో అపర్ణ బాలమురళి, విష్ణువిశాల్, దుషారా విజయన్, సెల్వ రాఘవన్, ఎస్‌జే సూర్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాతో పాటు ధనుష్ ప్రస్తుతం శేఖర్ కమ్ముల దర్శకత్వంలో కుబేరా అనే సినిమా చేస్తున్నాడు.

# జోగి గిఫ్ట్ ఆఫర్స్ పట్టివేత




**పెనమలూరు:** ఈ విజిల్ యాప్ లో పెనమలూరు అభ్యర్థి జోగి రమేష్ పై ఫిర్యాదు రావడంతో .. రాత్రి 11 గంటల సమయంలో అధికారులు తనిఖీలు చేసారు. ఎం వి ఆర్ గార్డెన్స్ ఫ్లాట్ నెంబర్ 27 చేరుకున్న సిబ్బంది లో వేసి ఉన్న ఇంటిలో ప్రవేశించడానికి గంటన్నర సమయం పట్టింది. పెనమలూరు పోలీసుల సహకారంతో తాళం పగలగొట్టి ఫ్లయింగ్ స్క్వాడ్ లోపలికి ప్రవేశించింది. వైయస్సార్సీపి సంబంధించిన మెటీరియల్స్ పింగాణి సెట్స్ ఫ్లాస్కస్ తదితర వస్తువులు గిఫ్ట్ హంపస్ లను స్వాధీనం చేసుకున్నారు. మరియు జోగి రమేష్ ఫోటోలతో ముద్రించిన క్యాప్స్, టీ షర్ట్స్, పార్టీకి సంబంధించిన కిట్ బ్యాగ్స్ స్వాధీనం చేసుకున్నారు. సుమారు వీటి విలువ అక్షరాల ఐదు లక్షలు ఉండవచ్చని అంచనా . వీటిని ఓటర్లకి చేరవేసే ప్రక్రియలో భాగంగా నిలువ చేసి ఉంటారని భావిస్తున్నారు

## వర్షంలోని కొత్తపల్లి గీత ప్రచారం




**అరకు:** వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అరకు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థిని కొత్తపల్లి గీత. మంగళవారం నాడు జరిగిన ఎన్నికల ప్రచారంలో భాగంగా రంపచోడవరం నియోజకవర్గం గంగవరం మండలం ముల్లేరు గ్రామంలో ప్రచార రథం నుండి ఓటర్లనుద్దేశించి ప్రసంగించారు. గ్రామంలో రాములవారి గుడి ఆవరణలో మాట్లాడుతూ కూటమి పార్టీల నాయకులకు,కార్యకర్తలకు,ప్రజలకు శిరస్సువంచి పాదాభివందనం చేస్తున్నానని .అనకాపల్లిలో నిన్న జరిగిన ప్రధాని బహిరగసభ వేదికపై ప్రధాని నరేంద్రమోదీ నా గెలుపుకు మద్దతుగా తలపై చేయిపెట్టి మనస్పూర్తిగా ఆశీర్వదించారని చంద్రబాబు గారు కూడా నిండుసభలో దీవించారని, స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రజలను ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేశారనీ,, దళితులను చంపి డోర్ డెలివరీ చేసి వాళ్ళు ఇక్కడ రాజకీయనాయకులు గా స్థానికంగా చెలామణి అవుతున్నారని వైసిపి నాయకులను విమర్శించారు ప్రతి చోటా లాగే రంపచోడవరంలో కూడా గంజాయి రాజ్యమేలుతుందనీ గిరిజనుల మీద నిందలేస్తూ పెద్దలు వాళ్ళ పబ్బం గడుపుకుంటున్నారనీ విమర్శలు చేశారు. త్వరలోనే రంపచోడవరం ఏరియాలో పవన్ కళ్యాణ్ గారి సభ పెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నామని ప్రజలంతా సిద్ధంగా ఉండాలని అన్నారు. ఈ నియోజకవర్గంలో ఎంపీ, ఎంఎల్ఏ బ్యాలెట్ లో వరుస సంఖ్య 3 రావడం జరిగిందనీ . త్రిశూలంవలే మూడుపార్టీలు కలిశాయనీ. ఓటర్లంతా బీజేపీ,టీడీపీ, జనసేన అభ్యర్థులు విజయానికి పాటుపడి కూటమికి ఓట్లేసి గెలిపించాలని అభ్యర్థించారు.

## వైకాపా గెలిస్తే రాష్ట్రం వల్లకాడు అవుతుంది



**కుప్పం.** శాంతిపురం మండలంలో ఎన్నికల ప్రచారంలో నారా భువనేశ్వరి పాల్గొన్నారు. రెగడదిన్నేపల్లి గ్రామంలో రోడ్ షోలో ప్రసంగించారు. మా చివరి శ్వాస వరకు కుప్పం ప్రజలకు రుణపడి ఉంటాం. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు చంద్రబాబు శ్రమిస్తున్నారు. రాష్ట్రాన్ని దోచుకోవడం, ప్రజలను హింసించడం జగన్ నైజం. జగన్ మరోసారి సీఎం అయితే రాష్ట్రం వల్లకాడు అవుతుంది. రాష్ట్ర భవిష్యత్తు కోసం కూటమి ప్రభుత్వం అవసరం. ఓటు అనే ఆయుధంతో రాష్ట్ర తలరాతను మార్చాలి. మే 13న రాక్షస పాలనకు ఓటుతో సమాధానం చెప్పాలని అన్నారు.

## జనసేనకు న్యాయవాదుల మద్దతు



**పిఠాపురం:** ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చెయ్యాలని గత వంద రోజులుగా న్యాయవాదులు ప్రశ్నిస్తున్న ఏ రాజకీయ పక్షాలు స్పందించలేదని, టిడిపి జనసేన బిజెపి కూటమి ముందుకు వచ్చి తామ అధికారం చేపట్టిన వెంటనే ఆ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేస్తామని చెప్పడం జరిగిందని అందుకు కూటమి పిఠాపురం అసెంబ్లీ అభ్యర్థి పవన్ కళ్యాణ్ కు మద్దతుగా ఓటు వేయాలని ర్యాలీ నిర్వహిస్తున్నామని న్యాయవాది నగేష్ తెలిపారు.

# మోడీకి రేడియో గిఫ్ట్ పంపించిన షర్మిళ



**విజయవాడ, మే:** విభజన సమయంలో ఇచ్చిన హామీలతోపాటు పదేళ్లలో కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని హామీ ఇచ్చే ప్రధాని ఏపీ నుంచి కదలాలన్నారు ఏపీ పీసీసీ చీఫ్ షర్మిలా రెడ్డి. ఏపీ ప్రజల మన్‌కీ బాత్ వినాలని చెప్పి ప్రధానమంత్రి నరేంద్రమోదీకి గిఫ్ట్ పంపించారు. అసలు ఈ రాష్ట్రంలో అడుగు పెట్టే అర్హతే మోదీకి లేదని అన్నారు. వచ్చే ముందు ఆంధ్రప్రదేశ్ ప్రజలకు క్షమాపణలు చెప్పి రావాలని సూచించారు. గిఫ్ట్‌తోపాటు పదే ప్రశ్నలు కూడా మోదీకి షర్మిల సంధించారు. పదేళ్లుగా రాష్ట్రంపై కపటప్రేమ చూపిస్తున్నారని... ఇప్పుడు మళ్లీ అదే ప్రేమతో వస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోసం ఇన్ని సార్లు వచ్చిన మోదీ... అభివృద్ధి కోసం ఒక్కనాడైనా వచ్చారా అని ప్రశ్నించారు. మోదీపై ఏపి ప్రజల తరుపున ఛార్జ్ షీట్ ఇస్తున్నామన్నరు షర్మిల. బీజేపీకి, మోదీకి దమ్ముంటే ఏపి ప్రజలకు ఇప్పుడైనా ఇచ్చిన హామీలను అమలు చేస్తామని అఫిడవిట్ రాసి ఇవ్వాలన్నారు. 10 ఏళ్లలో మోడీ చేసిన మోసాలకు షర్మిల ఇచ్చిన 10 ప్రశ్నలు ఇవే. 1) నాడు పార్లమెంటు సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా అని, తర్వాత మాటమరిచి రాష్ట్రాన్ని వెన్నుపోటు పొడిచారు2) జగన్ రివర్స్ టెండరింగ్‌ను అడ్డుకోకుండా, పోలవరం ప్రాజెక్టు వినాశనానికి నాంది పలికారు. ఎత్తుతగ్గించే కుట్రలు కూడా చేస్తున్నారు. 3) మీ చేతుల మీదుగా భూమి పూజ జరిపించుకున్న అమరావతి రాజధాని పదేళ్ల తర్వాత కూడా పూర్తి కాలేదు4) పోరాటాలు, ప్రాణార్పణ ద్వారా సాకారమైన విశాఖ ఉక్కును, అక్కడి సెంటిమెంటుకు విరుద్ధంగా అమ్మేద్దామని చూస్తూ, మళ్ళీ విశాఖ మీద దొంగ ప్రేమ ఒలకబోస్తున్నారు5) కడప స్టీల్ ప్లాంట్, విశాఖ రైల్వే జోన్ వంటివి, విభజన చట్టంలో కాంగ్రెస్ ఇచ్చిన అనేక హామీలను తుంగలోతొక్కి, రాష్ట్రానికి తీవ్రమైన అన్యాయం చేశారు 6) మీ దత్తపుత్రుడు(జగన్) మద్యం సిండికేటు నడుపుతూ, కల్తీ మద్యంతో మనుషుల ప్రాణాలు తీస్తున్నా మీరు ఉలకలేదు, పలకలేదు. ఢిల్లీలో కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు, ఇక్కడ మాత్రం ఎటువంటి చర్యలు లేవు7) దేశంలో ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు తీసేయడానికి సిద్ధమయ్యారు. రాష్ట్రంలో దళితులపై దాడులు, అత్యాచారాలు జరుగుతున్నా మీ కమిషన్లకు ఫిర్యాదులు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదు, చర్యలూ తీసుకోలేదు. 8) ఇసుక, మద్యం, ఖనిజాలు, అక్రమ కాంట్రాక్టులు, దొంగదారిలో రాష్ట్రం చేస్తున్న అప్పులు, కేంద్ర ఇచ్చే నిధుల మళ్లింపు, ఇలా ఎటు చూసినా రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతున్నా, కేంద్రం నుంచి ఎటువంటి చర్యలు లేవు9) కర్నూలులో అవినాష్ రెడ్డిని అరెస్ట్ చేయడానికి సిబిఐ వచ్చి, చేతకాక, శాంతిభద్రతల సమస్యంటూ బెదిరి వెనుతిరిగింది. ఈ విషయంలో మీ సర్కారు మిన్నకుండి కూర్చోవటం యావత్ దేశానికే అవమానం 10) దేశవ్యాప్తంగా ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మాటయిచ్చి, మాట తప్పి, దేశ యువతను, నిరుద్యోగులను ఘోరంగా మోసం చేసారు ఆంధ్ర ప్రదేశ్ ప్రజల మన్ కి బాత్‌లో మోదీ కచ్చితంగా దోషే అన్నారు షర్మిల. ఈ గడ్డ మీద అడుగుపెట్టిన ప్రతిసారి ఇక్కడి ప్రజలను క్షమాపణ కోరండని డిమాండ్ చేశారు.

# న్యాయంవైపు నిలబడండి



**కడప. మే 8.** కడప ఎంపీగా నన్ను గెలిపిస్తే ఇదే జిల్లాల్లో నా ఇంటికి వచ్చి కలవొచ్చు .. అవినాష్ రెడ్డి గెలిపిస్తే జైలుకి వెళ్లి కలవాల్సి ఉంటుందని ఏపీ పీసీసీ చీఫ్ షర్మిల అన్నారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా కమలాపురం నియోజకవర్గంలో కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిలా రెడ్డి ప్రచారం నిర్వహించారు. న్యాయానికి – నేరానికి మధ్య జరుగుతున్న పోరాటం కడప ఎన్నికలని స్పష్టం చేశారు. పంచడానికి తన వద్ద డబ్బు లేదని.. జూఖీ బిడ్డగా మీ ప్రేమ అభిమానం తన సొంతమన్నరు. రవీంద్రనాథ్ రెడ్డి ఎంత డబ్బులు ఇచ్చినా నా కోసం తీసుకోండి.. నా మేనమామ నాకోసం ఇస్తాడు..ఎంత ఇచ్చినా తీసుకోండని సూచించారు. మేనమామ కి భాధ్యత ఉంటుంది కదా సెటైర్ వేశారు. రవీంద్రనాథ్ రెడ్డి కి ఓటు వేశారు ఒక్క పని అయినా చేశారా అని ప్రజలను ప్రశ్నించారు. ఉబొూ ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు ఇస్తాం అన్నారు..తట్టెడు మట్టి తియ్యలేదన్నారు. సర్వారాయ ప్రాజెక్ట్ ను పూర్తి చేయలేదు. సర్వారాయ ప్రాజెక్ట్ ద్వారా రైతులకు ఏమో కానీ... రవీంద్రనాథ్ రెడ్డి చేపల చెరువు,రొయ్యల చెరువు కి నీళ్ళు వస్తున్నాయని మండిపడ్డారు. ఇదేనా రైతుల మీద మీకున్న ప్రేమని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డిని ప్రశ్నించారు. అధికారం ఉన్నది మీ చెరువులు నింపుకోడానికా ? కడప ఎంపీ అవినాష్ రెడ్డి స్టీల్ ప్లాంట్ కోసం ఒక్క ఉద్యమం చేయలేదు. విశాఖ స్టీల్ ఎంత ముఖ్యమో...మనకు కడప స్టీల్ అంత ముఖ్యమన్నారు. కడప స్టీల్ ప్లాంట్ వచ్చి ఉంటే లక్ష ఉద్యోగాలు అయినా వచ్చేవని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని 10 ఏళ్లలో సర్వనాశనం చేశారు.. మొదటి 5 ఏళ్లు బాబు మోసం చేశారు ..బాబు చేసిన అభివృద్ధి ఏమి లేదని జూఖీ వారసుడు జగన్ ను గెలిపిస్తే చేసింది ఏంటని ప్రశ్నించారు. జూఖీ హయాంలో 54 ప్రాజెక్ట్ లు మొదలు పెట్టారు 2014 నాటికి 42 పెండింగ్ ప్రాజెక్ట్ లు ఉన్నాయి.. జగన్ జూఖీ వారసుడు అయితే... జలయజ్ఞం ప్రాజెక్ట్ లు ఎందుకు కట్టలేదని ప్రశఅనించారు. జూఖీ హయాంలో మెగా డీఎస్సీ వేశాడు..పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు భర్తీ చేశాడు జగన్ 23 వేల ఉద్యోగాలకు మెగా డీఎస్సీ వేస్తామని చెప్పి దగా డీఎస్సీ చేశాడు.. 6 వేల ఉద్యోగాలకు దగా డీఎస్సీ వేసి ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్తున్నాడు ..ఒక్క ఉద్యోగం ఇప్పటి వరకు భర్తీ కాలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 2.35లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని జగన్ బాబుపై ఆగ్రహం వ్యక్తం చేశాడుని ..అధికారం ఇస్తే శాఖల పరిధిలో ఒక్క ఉద్యోగం భర్తీ చేయలేదు.. ఇప్పటికీ ప్రభుత్వ శాఖల పరిధిలో 2.25లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. రాష్ట్రం అంతా మాఫీయా మయం అయిందని లిక్కర్ మాఫియా,డ్రగ్స్ మాఫీయా,గంజాయి మాఫీయా,ఇసుక మాఫియా,మట్టి మాఫీయా దోచుకుంటోందన్నారు. 10 ఏళ్లలో మన రాష్ట్రానికి కనీసం రాజధాని కూడా లేకుండా చేశారని ఆరోపించారు. వైఎస్ వివేకా జగన్ ను ఆయన కొడుకు అనుకున్నారు. సొంత కొడుకు లాంటి వాడి వాడు హంతకులను కాపాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అఃఎ దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి.. కాల్ రికార్డ్స్ ఉన్నాయి..హత్యకు ముందు డీల్ మాట్లాడుకున్నారు అని ఆధారాలు ఉన్నాయి..ఇన్నీ ఆధారాలు ఉన్నా..నిందితుడు అవినాష్ రెడ్డి ని కాపాడుతున్నారన్నారు. అఃఎ ను సైతం మేనేజ్ చేస్తున్నారు.. న్యాయం కోసం సునీత తొక్కని గడప లేదన్నారు. కడప ప్రజలు న్యాయం వైపు నిలబడతారా? నేరం వైపు నిలబడతారా ? ఆలోచన చేసి ఓటు వేయాలని కోరుతున్నానన్నారు.

# కాపు ఓట్లు గుంపగుత్తేనా



**కాకినాడ, మే 9 :** ఏపీలో కాపుల రాజకీయ ఐక్యతకు వైసీపీ కృషి చేసిందని కాపు ఉపకులాలు బలంగా భావిస్తున్నాయి. పవన్ కళ్యాణ్‌ను రాజకీయంగా ఎదుర్కొనే క్రమంలో చేసిన విమర్శలు కాపుల ఐక్యతకు పరోక్షంగా ఉపయోగపడిందని ఆ వర్గాలు భావిస్తున్నాయి. త్వరలో జరిగే ఎన్నికల్లో కాపు సామాజిక వర్గం ఓట్లు ఈసారి ఎక్కువ భాగం జనసేనకు అనుకూలంగా పడతాయని ఆ వర్గం నేతలు భావిస్తున్నారు. దీనికి ముఖ్యమైన కారణాలు రెండు మూడు ఉన్నాయి. పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా వైఎస్సార్సీపీ టార్గెట్ చేయడం కాపులను ఆ పార్టీకి దూరం చేసింది. కాపులు జనసేన, తెలుగుదేశం వైపు ఉన్నా వైఎస్సార్సీపీని కూడా గత ఎన్నికల్లో చాలా మంది కాపులు వదల్లేదు. ఆ పార్టీలోని ముఖ్య నాయకుల్లో జక్కంపూడి రాజా, ఆళ్ల నాని, పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్, అంబటి రాంబాబు, వంగా గీత, పెండెం దొరబాబు, కురసాల కన్నబాబు.. వీళ్లంతా కాపు సామాజిక వర్గాని?కి చెందిన నాయకులే. అయితే పవన్ కళ్యాణ్‌ను టార్గెట్ చేయడానికి అదే కులం నాయకుల్ని వైసీపీ ప్రయోగించడం వికటించిందని కాపు వర్గం భావిస్తోంది. వీరిలో గుడివాడ అమర్నాథ్, అంబటి రాంబాబు, పేర్ని నాని ? ఈ ముగ్గుర్నీ ఇప్పుడు కాపు కులం అంతా వ్యతిరేకించే పరిస్థితి కల్పించింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ. కాపులు ఏ పార్టీకి ఓటేసినా, పార్టీలకు అతీతంగా పవన్ కళ్యాణ్ మీద ఆ సామాజిక వర్గంలో ఆదరణ భావం ఉంటుంది. పవన్ కళ్యాణ్ సమర్థత మీద, పవన్ కళ్యాణ్ కార్యదక్షత మీద, పవన్ కళ్యాణ్ ఎన్నికల్లో గెలుస్తాడా లేడా అన్న అంశం మీద వారికి భిన్నాభిప్రాయాలు ఉండవచ్చు. పవన్ కళ్యాణ్ సరైన వ్యూహంతో వెళ్లనప్పుడు, రాజకీయంగా పొరబాట్లు చేసినపుడు తీవ్రంగా విమర్శించినా కాపులందరికీ పవన్ కళ్యాణ్ మీద సాఫ్ట్ కార్నర్ ఉంటుందని చెబుతారు. సొంత కులం వాడు కావడంతో పాటు వ్యక్తిగతంగా మంచివాడు, అవినీతి ముద్ర లేకపోవడం, తాను సంపాదించింది కూడా నలుగురికీ పెడతాడు అనే అభిప్రాయం పవన్ కళ్యాణ్ మీద కాపుల్లో బలంగా ఉంది. ఈ తరహా అభిప్రాయం కాపులతో పాటు ఇతర కులాల్లో పవన్ కి ఓటు వేయని వారు కూడా అతని నిజాయితీని సందేహించరు. అతని అభిమానుల సంఖ్య తగ్గక పోవడానికి అది కూడా ఒక కారణం. రాజకీయంగా పవన్ కళ్యాణ్ గొప్ప నాయకుడిగా కనిపించకపోయినా ఒక వ్యక్తిగా పవన్ మీద కాస్త ఆదరణ భావం కాపుల్లో కచ్చితంగా ఉంది. గత ఐదేళ్లలో పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా భయంకరంగా తిట్టించడంలో వైయస్సార్సీపీ ముందుంది. గతంలో టీడీపీ నాయకులు పొత్తు వీడిపోయినప్పుడు పవన్ కళ్యాణ్‌ని తిట్టినా వైఎస్సార్సీపీ వ్యక్తిగతం టార్గెట్ చేసింది. ముగ్గురు రాష్ట్ర మంత్రులు పేర్ని నాని, గుడివాడ అమర్నాథ్, అంబటి రాంబాబులకు వేరే పనేమీ లేనట్టుగా పవన్ కళ్యాణ్ ని తిట్టడమే పూర్తి స్థాయి పనిగా పెట్టుకోవడం అనేది కాపుల్లో పవన్ మీద సాఫ్ట్ కార్నర్ పెంచింది. ఒక దశలో పేర్ని నాని తాను జగన్ కు పాలేరును అని చెప్పుకోవడం కూడా కాపులకు రుచించలేదు. దీంతో వైఎస్సార్సీపీలో ఉన్న కాపులను పాలేరు కాపులంటూ విమర్శించడం మొదలుపెట్టారు. హార్డ్ కోర్ కాపు కుల అభిమానం ఉన్నవారు. పవన్ మీద పెద్దగా ప్రేమ లేకుండా న్యూట్రల్ భావంతో ఉన్న సాధారణ కాపుల్లో కూడా మంత్రుల తిట్లతో పవన్ పట్ల సానుభూతి పెరిగేలా చేశాయివల్లభనేని వంశీ, కొడాలి నాని వంటి వారు చంద్రబాబును వ్యక్తిగతంగా తిట్టడం కమ్మవారికి ఎలా కోపాన్ని తెప్పించిందో, దాదాపు అదే స్థితి కాపుల్లో రావడానికి వైయస్సార్సీపీ వ్యూహం కారణం అయింది. ఇది అక్కడితో ఆగలేదు. ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన మరో ఇద్దరు కాపు నాయకులు చేగొండి హరిరామ జోగయ్య, ముద్రగడ పద్మనాభం ? ఎన్నికల ముందు లేఖలతో అంత హడావుడి చేసి చివరగా వైయస్సార్సీపీ వైపు చేరడం కూడా పవన్ మీద కుట్రలు జరుగుతున్నాయనే భావన పెంచింది. ఈ మొత్తం వ్యవహారం కాపులే లక్ష్యంగా జగన్ చేసిన వ్యూహంగా గుర్తించారు. దీంతో వారిలో ఏకీకరణకు ఈ అంశాలు కూడా కారణం అయ్యాయి.

# వదినమ్మే డైరక్ట్ టార్గెట్



**కడప, మే 9** ఏపీలో ఈసారి ఎన్నికలు ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. గత ఎన్నికల కంటే భిన్నంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా వైఎస్ కుటుంబంలో చీలిక వచ్చి.. సోదరుడు ఒకవైపు.. చెల్లెలు మరోవైపు నిలుస్తూ పొలిటికల్ హీట్ పెంచుతున్నారు. కడప వేదికగాకుటుంబ సభ్యుల మధ్య జరుగుతున్న రాజకీయం పతాక స్థాయికి చేరుకుంది. సోదరుడుతో విభేదించిన షర్మిలకు కాంగ్రెస్ పగ్గాలు దక్కాయి. కాంగ్రెస్ పార్టీకి జవసత్వాలు నింపడానికి షర్మిల గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో కడప రాజకీయాలు దడ పుట్టిస్తున్నాయి. కడప నుంచే తేల్చుకోవాలని షర్మిల గట్టిగానే డిసైడ్ అయ్యారు. కడప పార్లమెంట్ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగారు. అటు పులివెందులలో సైతం సోదరుడికి చికాకు తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. అసలు ప్రచారమే అన్నది కనిపించని పులివెందులలో.. తన గెలుపు బాధ్యతను అర్ధాంగి భారతికి అప్పగించారు జగన్. కడపలో వైసిపి దూకుడుకు చెక్ చెప్పాలని షర్మిల భావిస్తున్నారు. పులివెందులలో సైతం అన్నకు గట్టిగానే బదులిస్తున్నారు. దీంతో భారతి పులివెందులలో క్షణం తీరిక లేకుండా గడపాల్సి వస్తుంది. ఒకవైపు భారతి, మరోవైపు షర్మిల పోటీపడిప్రచారం చేస్తున్నారు. ఒకరి వ్యాఖ్యలపై ఒకరు గట్టిగానే రిప్లై ఇస్తున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వైయస్ భారతి ఏపీలో వైసీపీ నే సింగిల్ ప్లేయర్ అంటూ చెప్పుకొచ్చారు. దీనికి కౌంటర్ ఇచ్చారు షర్మిల. గొడ్డలితో వివేకానంద రెడ్డిని నరికేసినట్టు.. మిగతా వాళ్ళను కూడా నరికేయండి.. అప్పుడు మీరే సింగిల్ ప్లేయర్ అంటూ షర్మిల విరుచుకుపడ్డారు. అదే సమయంలో కడప వైసీపీ అభ్యర్థి అవినాష్ రెడ్డిపై సైతం తీవ్ర వ్యాఖ్యలు చేశారు షర్మిల. ఓటమితో అవినాష్ రెడ్డి ఊరు దాటేందుకు సిద్ధమయ్యారని విమర్శించారు. దీనికోసం పాస్పోర్ట్ కూడా సిద్ధం చేసుకున్నారని చెప్పుకొచ్చారు. మొత్తానికైతే ఒక వ్యూహం ప్రకారం వైయస్ భారతి తో పాటు అవినాష్ రెడ్డి పై విమర్శలతో దూసుకెళ్తున్నారు షర్మిల

## రెస్ట్ మోడ్ లోకి డీఎల్



**కడప, మే 9:** ఎన్నికల నామినేషన్ల ముందు వరకూ మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి యాక్టివ్ గా కనిపించారు. అధికార వైసీపీని ఓడించాల్సిందేనంటూ ఆయన మీడియా సమావేశాలు పెట్టి మరీ పిలుపు నిచ్చారు. జగన్ ను ఓడించి తీరుతానని శపథం చేశారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మాత్రం ఆయన సైలెంట్ మోడ్ లోకి వెళ్లిపోయారు. డీఎల్ ను ఇప్పుడు ఏ రాజకీయ పార్టీలూ పట్టించుకోలేదు. అసలు ఆయనంటూ ఒకరున్నారా? అన్న అనుమానం కూడా కలుగుతుంది. డీఎల్ లో రాజకీయంగా ప్రభావం చూపేంత శక్తి తగ్గిందా? లేక ఆయనను పార్టీలోకి తెచ్చుకుని లేనిపోని తలనొప్పులు తెచ్చుకోవడం ఎందుకని భావిస్తున్నారా? అన్నది మాత్రం అర్థం కాకుండా ఉంది. డీఎల్ రవీంద్రారెడ్డి గత ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. అయితే ఆయనకు ఎలాంటి పదవి లభించలేదు. ప్రత్యక్ష ఎన్నికల్లో సీటు దక్కకపోయినా కనీసం ఎమ్మెల్సీ సీటు అయినా ఇస్తుందని భావించారు. కానీ వైసీ?పీ అధినాయకత్వం నాలుగేళ్లపాటు ఆయనను పట్టించుకోలేదు. దీంతో ఆయనకు చిర్రెత్తుకొచ్చింది. ఆయన వైసీపీకి వ్యతిరేకంగా మాట్లాడుతూ పార్టీ నుంచి బయటకు వచ్చారు. జగన్ పాలనపై నిప్పులు చెరిగారు. ఆయన టీడీపీలో చేరతారన్న ప్రచారం కూడా కొంతకాలం పాటు జరిగింది. ఆయన ఉండవల్లి వెళ్లి చంద్రబాబును కలిసి పార్టీలో చేరతారని కూడా అన్నారు. కానీ ఆయన వెళ్లలేదు. వీళ్లు పిలవలేదు. దీంతో ఆయనను ఎవరూ పట్టించుకోనట్లయింది. డీఎల్ రవీంద్రారెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కీలకమైన నేత. మైదుకూరు నుంచి ఆయన ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగా పనిచేశారు. 2009లో ఆయన చివరి సారి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితేరాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆయన రాజకీయంగా తెరమరుగయ్యారు. ఆయన ఇప్పుడు అవుట్ డేటెట్ లీడర్ గానే పార్టీ అధినేతలు భావించే డీఎల్ ను పార్టీలు లైట్ గా తీసుకున్నాయనే భావించాలి. సీనియర్ లీడర్లందరూ ఒక్కొక్కరూ రాజకీయంగా కనుమరుగయి పోతున్నారు. జనరేషన్లు మారిపోయిన సమయంలో సీనియర్లు కూడా తమంతట తాము రాజకీయాల నుంచి తప్పుకోవడమే బెటర్ అన్న కామెంట్స్ వినపడుతున్నాయి. టీడీపీకి మద్దతు ప్రకటించినా... ఇప్పుడు టీడీపీలో ఆయన పేరు ఎక్కడా వినిపించడం లేదు. దీంతో డీఎల్ రాజకీయం ఇక ముగిసినట్లేనని అనుకోవాల్సి ఉంటుంది. టీడీపీ కూడా పట్టించుకోకపోవడంతో డీఎల్ రాజకీయంగా స్వచ్ఛంద పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే ఆయన ఇప్పుడు తెలుగుదేశం పార్టీకి మద్దతు ప్రకటించారు. మద్దతు ప్రకటించినా పెద్దగా యాక్టివ్ గా లేరు. ఏ పార్టీ డీఎల్ ను చేర్చుకోకపోవడంతోనే ఈ పరిస్థితి తలెత్తింది. అందుకే డీఎల్ ఇప్పుడు మౌనంగా ఉంటున్నారు. భవిష్యత్ లో ఆయన రాజకీయాలకు మరింత దూరం అయ్యే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తుంది. అందుకే డీఎల్ పేరును ఇక మైదుకూరు నుంచే కాకుండా ఏపీ రాజకీయాల నుంచి పార్టీ నేతలు డిలీట్ చేస్తున్నట్లే కనపడు

గరుడ వార్త


# దేశంలో తగ్గిన హిందువుల జనాభా.. మైనారిటీల జనాభా పైకి



న్యూఢిల్లీ: భారతదేశంలో మెజారిటీగా ఉన్న హిందూ మతం జనాభా గణనీయంగా తగ్గింది. 1950 నుంచి 2015 మధ్య కాలంలో దేశంలో హిందువుల జనాభా వాటా 7.81 శాతం తగ్గినట్లు ప్రధాన మంత్రి ఆర్థిక సలహా మండలి(ఇఎసి-పిఎం) తన నివేదికలో వెల్లడించింది. ఒకపక్క దేశంలో హిందువుల జనాభా తగ్గిపోగా మరోపక్క బౌద్ధులు, సిక్కులు, ముస్లింలు, క్రైస్తవులతోసహా మైనారిటీల జనాభా పెరిగింది. అయితే సార్శీలు, జైనుల జనాభాలో మాత్రం తగ్గుదల కనిపించింది. ఇతర పొరుగు దేశాలలో మెజారిటీ మతస్తుల జనాభా పెరుగుదల ఉండగా భారత్‌లో మాత్రం భిన్నంగా ఉండడం గమనార్హం. 1950లో భారత జనాభాలో హిందువుల వాటా 84.68 శాతం ఉండగా 2015 నాటికి అది 78.06 శాతానికి తగ్గింది. ముస్లింల జనాభా మాత్రం 1950లో 9.84 శాతం ఉండగా 2015 నాటికి అది 14.09 శాతానికి చేరుకున్నట్లు అధ్యయనంలో వెల్లడైంది. హిందువుల జనాభా పొరుగుదేశమైన మయన్మార్‌లో 10 శాతం తగ్గగా నేపాల్‌లో అధిక సంఖ్యాక మతమైన హిందూ జనాభాలో 3.6 శాతం తగ్గుదల ఉందని నివేదిక తెలిపింది. 2024 మే నెలలో విడుదలైన ఈ నివేదికన 167 దేశాలలో జనాభా సరళిని అధ్యయనం చేసింది. భారత్‌లో మైనారిటీలకు రక్షణ లభించడమేగాక వారు వృద్ధి చెందుతున్నారనడానికి ఈ లెక్కలే నిదర్శనమని నివేదిక పేర్కొంది. మైనారిటీల జనాభా పెరుగుదలకు కారణాలను విశ్లేషించడం తమ ఉద్దేశం కాదని, మైనారిటీలకు సమాజంలో తగిన ప్రాతినిధ్యం లభిస్తున్నదా లేదా అన్న విషయంపైనే తాము దృష్టి సారించామని నివేదికలో పేర్కొన్నారు. మెజారిటీ జనాభా వాటా తగ్గడం, మైనారిటీ జనాభా వాటా పెరగడాన్ని బట్టి అన్ని విధానపరమైన చర్యలు, రాజకీయ నిర్ణయాలు, సమాజపరమైన ప్రక్రియలు సమసమాజ స్థాపనకు తగిన వాతావరణాన్ని నిర్మించడానికి దోహదపడాలని నివేదిక పేర్కొంద.ఇ ఇదిలా ఉండగా..నివేదికపై బిజెపి నాయకులు వెంటనే తీవ్రంగా స్పందించారు. దశాబ్దాల పాలనలో కాంగ్రెస్ మనకు మిగిల్చింది ఇదేనని బిజెపి ఐటి సెల్ అధిపతి అమిత్ మాల్వీయ వ్యాఖ్యానించారు. వారికే ఈ దేశాన్ని వదిలిపెడితే భారత్‌లో హిందువులకు స్థానం మిగలదని ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో సొంత దేశంలో హిందువులను ఎనిమిదవ తరగతి పౌరులుగా పరిగణించారని ఆంధ్రప్రదేశ్ బిజెపి ఉపాధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి ఆరోపించారు.

# హర్యానాలో బిజెపి హైరానా



హర్యానాలో బిజెపి సారధ్యపు రాష్ట్ర ప్రభుత్వానికి సంకట స్థితి ఏర్పడింది. ఈ ప్రభుత్వానికి సభలో సరైన బలం లేదని, వెంటనే బలపరీక్ష నిర్వహించేలా ఆదేశించాలని జెపిపి నేత దుశ్యంత్ చౌతాలా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను కోరారు. చౌతాలా రాష్ట్ర మాజీ ఉపముఖ్యమంత్రిగా, జననాయక్ జనతాపార్టీ (జెజెపి)నేతగా ఉన్నారు. గవర్నర్ దత్తాత్రేయకు చౌతాలా ఓ లేఖ పంపించారు. ఇప్పటి రాజకీయ పరిణామాలను గమనించాలని, సభలో ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ ప్రభుత్వం బలం తగ్గిందని, వెంటనే ఈ ప్రభుత్వం బలనిరూపణ జరగాల్సి ఉందని చౌతాలా డిమాండ్ చేశారు. ఇండిపెండెంట్ల మద్దతుతో ఇంతకు ముందు ప్రభుత్వం గట్టెక్కిందని, కానీ ఇప్పుడు వారు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారని, ఇక ఈ సర్కారు మైనార్టీలో పడిందా? లేదా అనేది గవర్నర్ నిర్ధారించాల్సి ఉందని, బలపరీక్షకు సెషన్ ఏర్పాటు చేయాల్సి ఉందని చౌతాలా డిమాండ్ చేశారు. కాగా రాష్ట్రంలో ముగ్గురు ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు సైనీ ప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరించుకున్నారు. దీనితో నిజంగానే ప్రభుత్వం మైనార్టీలో పడింది. తాము కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తామని ఇండిపెండెంట్ ఎమ్మెల్యేలు ప్రకటించారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికార అనిశ్చిత నెలకొందని, రాష్ట్రపతిపాలన విధించాలని, మధ్యంతర ఎన్నికలు నిర్వహించాలని పార్టీ డిమాండ్ చేసింది. కాగా తమ ప్రభుత్వానికి వచ్చిన ఢోకా ఏమీలేదని, ఎటువంటి పరిస్థితిని అయినా ఎదుర్కొంటామని సిఎం గురువారం కర్నాల్‌లో ప్రకటించారు. తాము మార్చిలోనే సభలో విశ్వాస తీర్మానంలో గెలిచామని, మరోసారి సమయం వస్తే సత్తా నిరూపించుకుంటామని ఆయన తెలిపారు. దుష్యంత్ చౌతాలాకు ధైర్యముంటే ఆయన బలం ఎంతో చెప్పాలని సవాలు విసిరారు. ఇక మాజీ ముఖ్యమంత్రి, బిజెపి నేత ఎంఎల్ ఖట్టర్ స్పందిస్తూ బిజెపి సర్కారుకు వచ్చిన ముప్పేమీ లేదన్నారు. పలువురు ఎమ్మెల్యేలు తమను సంప్రదిస్తున్నామని చెప్పారు.

హర్యానా అసెంబ్లీలో పార్టీల బలాబలాలు

హర్యానా అసెంబ్లీలో మొత్తం సభ్యుల సంఖ్య 90

ఇప్పుడు వాస్తవికంగా ఉన్న సభ్యుల సంఖ్య 88

సభలో బిజెపి ఎమ్మెల్యేల సంఖ్య 40

కాంగ్రెస్ సంఖ్యాబలం 30

జెజెపి సభ్యుల సంఖ్య 10

ఇండిపెండెంట్లు 6

ఐఎన్ఎల్‌డి 1, హెచ్ఎల్‌పి 1

# కుమారుడిని కాదు కాబట్టే అవకాశం దక్కలేదు:అజిత్ పవార్



పుణె: ఎన్‌సిపి(శరద్ పవార్) అధ్యక్షుడు శరద్ పవార్ కుమారుడిని కాదు కాబట్టే తనకు రాజకీయ అవకాశం లభించలేదని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ గురువారం వ్యాఖ్యానించారు. 80 ఏళ్లు పైబడిన తర్వాత కొత్త వారికి అవకాశం ఇవ్వాల్సి ఉంటుందని ఆయన అన్నారు. బిజెపితో చర్చలు జరిగాయని, కాని తుది నిర్ణయం తీసుకోలేదని శరద్ చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ కనీసం చర్చలు జరిగాయని అయినా ఆయన(శరద్ పవార్) ఒప్పుకున్నారని, చర్చలకు తానే ప్రత్యక్ష సాక్షినని అజిత్ చెప్పారు. గత ఏడాది జులైలో అజిత్ పవార్, మరో 8 మంది ఎన్‌సిపి ఎమ్మెల్యేలతో కలసి మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే-బిజెపి ప్రభుత్వంలో చేరారు. దీంతో శరద్ పవార్ స్థాపించిన ఎన్‌సిపిలో చీలిక అనివార్యమైంది. గురువారం పుణె జిల్లాలోని షిరూర్‌లో ఒక ఎన్నికల ప్రచార సభలో అజిత్ పవార్ ప్రసంగిస్తూ తనకు కూడా 60 ఏళ్లు దాటాయని, తనకు అవకాశం లభించాలా వద్దా అని ప్రశ్నించారు. తాము తప్పుగా ఏమి ప్రవర్తించలేదని, అందుకే తమకు ఆవేశం వచ్చిందని ఆయన చెప్పారు. పవార్ సాబ్ తమకు దేవుడు లాంటివారని, ఆ విషయంలో ఎటువంటి సందేహం లేదని అజిత్ స్పష్టం చేశారు. అయితే ప్రతి వ్యక్తికి ఒక కాలం ఉంటుందని, 80 ఏళ్లు దాటిన తర్వాత కొత్త వారికి అవకాశం ఇవ్వాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. ఎన్‌సిపి అధ్యక్షుడు శరద్ పవార్‌కు తాను కుమారుడినైతే తనకు అవకాశం వచ్చి ఉండేదా కాదా అని ఆయన ప్రశ్నించారు. కచ్చితంగా తనకు అవకాశం వచ్చి ఉండేదని, కాని తాను సొంత కుమారుడిని కాని కారణంగానే తనకు అవకాశం లభించలేదని ఆయన చెప్పారు.

# మల్కాజిగిరిలో స్థానికుడికే ఓటేయండి: కెటిఆర్

హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయాలంటేకే కేసీఆర్ సైనికులు పార్లమెంట్‌లో ఉండాలి అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తేల్చిచెప్పారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఓల్డ్ అల్వాల్‌లో ఏర్పాటు చేసిన యూత్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ, మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తున్న ఈటల రాజేందర్, సునీతా మహేందర్ రెడ్డి ఇద్దరూ పొలిటికల్ టూరిస్టులు అని, మే 13 తర్వాత మళ్లీ వారు కనబడరు అని పేర్కొన్నారు. మల్కాజ్‌గిరిలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిది తాండూరు అని. వాస్తవానికి చేవెళ్ల సీటు అడిగితే బలవంతంగా రేవంత్ రెడ్డి మల్కాజ్‌గిరి సీటు కట్టబెట్టారన్నారు. . ఆమె కూడా బలవంతంగానే ప్రచారం చేస్తోందని, ఆమె ఓడిపోతే మళ్లీ తాండూరు వెళ్లాల్సిందేనన్నారు. . ఇక ఈటల రాజేందర్‌ది కూడా మల్కాజ్‌గిరి కాదని, . ఆయన హుజురాబాద్ వెళ్లిపోవాల్సిందేనే వెల్లడించారు.. బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి మాత్రం లోకల్. ఉప్పల్‌లోనే ఉంటారని, మన మధ్యలోనే ఉండే వ్యక్తి అంటూ ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని కేటీఆర్ కోరారు. ఐదు నెలల కింద మస్తు మాటలు చెప్పిండు రేవంత్ రెడ్డి. ఆడబిడ్డలకు స్కూటీలు, తులం బంగారం ఇస్తా అన్నాడు. రూ. 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తా అన్నాడు. మహిళలకు రూ. 2500 ఇస్తా అన్నాడు. కానీ ఏ ఒక్కటీ కూడా అమలు కాలేదు. ఐదు నెలల నుంచి చిల్లర మాటలు ఉద్దెర మాటలు మాట్లాడుతున్నాడు. తెలంగాణ పిచ్చోడి చేతిలో రాయిలా తయారైంది. సినిమాలో విలన్ డైలాగులు తప్ప ఒక్క మంచి పని చేయలేదు. కొత్త ఇండస్ట్రీలు వచ్చుడేమో కానీ.. ఉన్న ఇండస్ట్రీలు వెళ్లిపోతున్నాయి. ఫార్మా సిటీని రద్దు చేశారు. ఇలా తెలివి తక్కువోళ్లకు అవకాశం ఇస్తే కరెంట్, ఉద్యోగాలు రావు. రియల్ ఎస్టేట్ ఢమాల్.. ఇచ్చిన గ్యారెంటీ నిలుపుకోలేని పరిస్థితి కాంగ్రెస్ పార్టీది అని కేటీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అంటే.. ఇన్వర్టర్, జనరేటర్, క్యాండిల్ లైట్, టార్చ్ లైట్, పవర్ బ్యాంక్, ఛార్జింగ్ బల్బ్ అని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ఉన్నంతకాలం కరెంట్ ఉండదు. పార్లమెంట్ ఎన్నికలు రాగానే.. బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటేయాలని అడుగుతున్నారు. కేసీఆర్ 2001లో టీఆర్ఎస్ పార్టీ పెట్టినప్పుడు



తెలంగాణ సాధించుకోవాలంటే పార్లమెంట్‌లో మనం శాసించే పరిస్థితి ఉండాలన్నారు. కాంగ్రెస్ , బీజేపీ ఎంపీలు.. రాహుల్ గాంధీ, మోదీ చెప్పింది చేస్తారు. తెలంగాణ గురించి దమ్మున్న నాయకులే కొట్లాడుతారు. జూన్ 2వ తేదీ తర్వాత కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేసి తన గుప్పిట్లో పెట్టుకోవాలని ఆలోచన చేస్తున్నది. కేంద్ర పాలిత ప్రాంతం అయితే.. హైదరాబాద్ అభివృద్ధి ఆగిపోతుంది. ఒక్క చిన్న పని కూడా చేసుకునేందుకు అవకాశం ఉండదు. మోరీ, నాలా నిర్మించాలన్నా, రోడ్డు వేయాలన్నా ఢిల్లీకి పోయి అడగాలి. కేంద్ర పాలిత ప్రాంతం ప్రతిపాదనను అడ్డుకోవాలంటే గులాబీ జెండా పార్లమెంట్‌లో ఎగరాలి. రాగిడి లక్ష్మారెడ్డి గెలవాలని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి , మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి , మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి , మల్కాజ్గిరి ఎన్నికల ఇంచార్జ్ నందికంటి శ్రీధర్ , బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,ముఖ్య నాయకులు,హాజరయ్యారు. .. కార్పొరేటర్లు,మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, మల్కాజిగిరి యూత్,ముఖ్య నాయకులు,కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# తెల్లకాగితంపై సంతకం చేయించి రేప్ కేసు పెట్టారు

కోల్‌కతా: లోక్‌సభ ఎన్నికల వేళ పశ్చిమబెంగాల్‌లో సందేశ్‌ఖాలీ ఆందోళనల వ్యవహారం రాజకీయంగా తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఇదంతా బీజేపీ కుట్రేనని తృణమూల్ కాంగ్రెస్ సంచలన ఆరోపణలు చేసింది. ఇప్పుడు ఈ వ్యవహారం మరో మలుపు తిరిగింది. తమపై అకృత్యాలకు పాల్పడ్డారంటూ టీఎంసీ నేతలపై ఫిర్యాదు చేసిన ముగ్గురు మహిళల్లో ఒకరు తాజాగా తన ఫిర్యాదును వెనక్కి తీసుకున్నారు.


తాను ఎలాంటి వేధింపులకు గురికాలేదని, స్థానిక బీజేపీ కార్యకర్తలు తనతో బలవంతంగా తెల్లకాగితంపై సంతకం చేయించారని ఆరోపించారు. “బీజేపీ మహిళా మోర్చా విభాగానికి చెందిన కొందరు నేతలు, ఇతర కార్యకర్తలు ఆ మధ్య మా ఇంటికి వచ్చారు. పీఎంఏవైలో పేరును చేర్చుతామంటూ తెల్లకాగితంపై నా సంతకం తీసుకున్నారు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి టీఎంసీ నేతలపై లైంగిక వేధింపుల ఫిర్యాదు చేయించారు. నేనెప్పుడూ రాత్రివేళ ఆ పార్టీ ఆఫీసుకు వెళ్లలేదు. నాపై ఎలాంటి అకృత్యాలు జరగలేదు” అని ఆ మహిళ పేర్కొన్నారు. తన వల్ల తప్పు జరిగిందని తెలుసుకుని ఇప్పుడు కేసును వెనక్కి తీసుకున్నానని చెప్పారు. ఈ విషయం తెలిసి కొందరు బీజేపీ నేతలు బెదిరిస్తున్నారని, తనకు రక్షణ కల్పించాలని కోరుతూ పోలీస్‌లకు మరో ఫిర్యాదు చేశారు. ఆ మహిళ ఆరోపణలను బీజేపీ నాయకులు ఖండిస్తున్నారు. ఇదిలా ఉండగా సందేశ్‌ఖాలీ సంఘటన బీజేపీ కుట్ర అని ఆరోపించిన టీఎంసీ, ఇటీవల స్టింగ్ ఆపరేషన్‌కు సంబంధించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో విపక్ష నేత సువేందు అధికారి ఉన్నట్టు బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గంగాధర్ వ్యాఖ్యానించడం ఈ వీడియోలో కనిపించింది. షాజహాన్ షేక్ సహా ముగ్గురు తృణమూల్ నేతలపై అత్యాచార ఆరోపణలు చేసేలా స్థానిక మహిళలను ప్రేరేపించాలని




సువేందు తనకు సూచించినట్టు అతడు వీడియోలో చెప్పారు. ఈ నేపథ్యంలో సందేశ్‌ఖాలీ వ్యవహారంపై టీఎంసీ కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించనుంది. వీడియో ఆధారంగా బీజేపీ నేత సువేందు, ఇతరులపై ఫిర్యాదు చేస్తామని టీఎంసీ వర్గాలు గురువారం వెల్లడించాయి. ఈ మేరకుఈసీకి లేఖ రాస్తామని తెలిపాయి. అయితే ఈ వీడియోను బీజేపీ నేతలు ఖండిస్తున్నారు. అది మార్ఫింగ్ వీడియో అని, కృత్రిమ మేధ (ఏఐ)తో తన స్వరాన్ని రూపొందించి అందులో పెట్టారని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గంగాధర్ ఆరోపించారు. దీనిపై సిబిఐకి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

# పోలింగ్ కేంద్రంలో ఓటేసిన బాలుడు

న్యూఢిల్లీ : ప్రస్తుతం దేశంలో దశల వారీగా సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఇప్పటికే పలు లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ పూర్తయింది. ఈ నేపథ్యంలో ఒక పోలింగ్ కేంద్రంలో ఓ బాలుడు ఓటు వేస్తోన్న వీడియో తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దానిపై తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మీడియా కథనాల ప్రకారం మధ్యప్రదేశ్ లోని బెరాసియా ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. బెరాసియా ప్రాంతానికి చెందిన వినయ్ మెహర్, బీజేపీ స్థానిక నేత. తన మైనర్ కుమారుడితో కలిసి ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చాడు. తన తండ్రి స్థానంలో ఆ పిల్లాడు ఈవిఎం బటన్ నొక్కి బీజేపీకి ఓటు వేశాడు. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. దాంతో ఇవి కాస్తా కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ దృష్టికి చేరాయి. “బీజేపీ.. ఎన్నికల సంఘాన్ని పిల్లల ఆటవస్తువుగా మార్చింది. బీజేపీ నేత వినయ్ మెహర్ తన ఓటును కుమారుడితో వేయించారు. ఆ తతంగాన్ని వీడియో తీసి, ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. పిల్లల్ని, మొబైల్ ఫోన్లను లోపలికి ఎలా అనుమతించారు? దీనిపై ఏమైనా చర్యలు ఉంటాయా ? అని కమల్‌నాథ్ ప్రశ్నించారు.




దీనిపై ఎన్నికల సంఘం నుంచి స్పందన రావాల్సి ఉంది. గుజరాత్ లోని దాహోద్ లోక్‌సభ నియోజక వర్గ పరిధి లోని ఓ పోలింగ్ కేంద్రంలో కూడా ఇదే తరహా సంఘటన ఒకటి జరిగింది. కేంద్రం లోపల నుంచి వీడియోను ప్రత్యక్ష ప్రసారం చేసిన విజయ్ భాభోర్‌ను పోలీస్‌లు అరెస్ట్ చేశారు. అతడు స్థానిక బీజేపీ నేత కుమారుడు. ఇలాంటి చర్యతో ప్రజాస్వామ్యాన్ని అవమానించారంటూ కాంగ్రెస్ తీవ్ర విమర్శలు చేసింది.

# కశ్మీర్ ఎన్‌కౌంటర్‌లో మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టు సహా ఇద్దరి హతం

శ్రీనగర్ : కశ్మీర్ లోని కుల్గామ్ జిల్లాలో బుధవారం రాత్రి భద్రతా బలగాలు, టెర్రరిస్టులకు మధ్య జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మోస్ట్‌వాంటెడ్ టెర్రరిస్టు సహా మరో ఇద్దరు ఉగ్రవాదులు మృతి చెందారు. దక్షిణ కశ్మీర్ కుల్గామ్ లోని రెడ్వానీ పయీన్ ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి భద్రతా దళాలు చేపట్టిన గాలింపు మంగళవారం వరకు కొనసాగింది. ఈ సమయంలో ముగ్గురు ఉగ్రవాదులు ఎదురుపడగా, ఇరు వర్గాల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. కాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతులు వాంటెడ్ టెర్రరిస్ట్ బాసిత్ అహ్మద్‌దార్, లష్కరే తోయిబాకి చెందిన మోమిన్ గుల్జార్, ఫహీమ్ అహ్మద్ బాబా గా గుర్తించారు.



Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com